Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598




# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

మంగళవారం TUESDAY || 10.02.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 160 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah



## మంచి నాయకుడు కావాలంటే ఏం చేయాలి?

### పరీ పే చర్చలో ప్రధాని మోదీ

**ఢిల్లీ, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** ప్రధాని మోదీ పరీ పే చర్చలో భాగంగా పలువురు విద్యార్థులతో సంభాషించారు. బోర్డు పరీక్షల సీజన్‌కు ముందు పరీక్షలు, వ్యక్తిగత వృద్ధి, క్రమశిక్షణ, నాయకత్వం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, దేశ నిర్మాణంపై విద్యార్థులకు ప్రధాని మోదీ మార్గదర్శకత్వం అందించారు. "మన దేశంలో 10, 12 తరగతుల విద్యార్థులు కూడా వికసిత్ భారత్ 2047 కలను తమ మనస్సుల్లో మోస్తున్నారని చూడటం నాకు సంతోషంగా అనిపించింది. ఇది నాకు చాలా సంతోషకరమైన విషయం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అలాగే క్రమశిక్షణతో కూడిన అలవాట్ల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ ప్రస్తావించారు. "మనం అభివృద్ధి చెందిన దేశాల అలవాట్లను అలవర్చుకోవాలి... మనం రెడ్ లైట్ల వద్ద వాహనాల ఇంజిన్లను ఆపివేయాలి... ఆహారాన్ని వదిలివేయకూడదు, వృధాను తగ్గించాలి... మన జీవితంలో క్రమశిక్షణ చాలా ముఖ్యం..." అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.




## మున్సిపల్ ఎన్నికల వేళ రెండ్రోజులు పాటు మద్యం దుకాణాలు బంద్

**హైదరాబాద్, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** మద్యం ప్రియులకు మున్సిపల్ ఎన్నికలు షాక్ ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ కీలక ప్రకటన చేసింది. రెండు రోజుల వైన్స్ బంద్ కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సమయం ఆసన్నమవుతోంది. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగను ంది. 13 ఫలితాలు విడుదల కానున్నాయి. ఈఆయా మున్సిపాలి టీల పరిధిలోని మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఈనెల 9వ తేదీ నుంచి సాయంత్రం 5 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేయాలని ఎన్నికల, అబ్కారీ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా 13వ తేదీ వరకు ఫలితాల నేపథ్యంలో వైన్స్, బార్లు మూసివేయనున్నారు. మరోవైపు.. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. సాయంత్రానికి మైకులు మూగబోయాయి. భిన్నంగా ఈసారి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలు అధికార, ప్రతిపక్షాల మధ్య యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. వ్యూహాలు, ప్రతి వ్యూహాలతో రంగంలోకి దిగిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు ఒకరిపై మరొకరు పై చేయి సాధించాలన్న పట్టులతో ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాయి.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే... మరింత గోసపడతం...

- పేట వీధులన్నీ గులాబీ మయం
- బిఆర్ఎస్ రోడ్ షో గ్రాండ్ సక్సెస్
- పేట మున్సిపాలిటీలోని 48 వార్డుల బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** మరోసారి కాంగ్రెస్ కు ఓటేస్తే.. మరింత గోసపడతం అని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ప్రజార్యాలీతో తాళ్లగడ్డ నుంచి ప్రారంభమైన రోడ్ షో కోర్ట్ చౌరస్తా, పూల సెంటర్, పిఎస్ఆర్ చౌరస్తా, రాఘవ ప్లాజా, వాణిజ్య భవన్ సెంటర్, శంకర్ విలాస్, గాంధీ విగ్రహం, కొత్త బస్టాండ్ వరకు పట్టణమంతా గులాబీమయంగా మారింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గులాబీ దండుతో ప్రజలకు అభివాదం చేసుకుంటూ బిఆర్ఎస్ కేడర్ కు జోష్ నింపారు. కొత్త బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్లో ఆయన మాట్లాడారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనతో మీకేం లాభం జరిగిందో ఆలోచన చేయండి.

2వ పేజీ లో...

## శరద్‌పవార్‌కు అస్వస్థత

### ఆస్పత్రికి తరలింపు



**ఢిల్లీ, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. దాంతో కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.బారామతి నుంచి పుణెలోని రూబీ హాల్ క్లినిక్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దగ్గు, జలుబుతో ఆయన బాధపడుతున్నారని, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందిపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## సన్నబియ్యం పంపిణీ దేశ చరిత్రలోనే చరిత్రాత్మకం

- పట్టణాల అభివృద్ధికీ ప్రత్యేక ప్రణాళికలు
- మౌలిక సదుపాయాల కల్పనకు రూట్ మ్యాప్
- పురపాలక సంఘం ఎన్నికల్లోనూ విజయం కాంగ్రెస్ దే
- సన్న బియ్యం పంపిణీతో తెలంగాణలో గేమ్ చెంజర్
- ఉచిత బస్ ప్రయాణంతో మహిళలలో హర్షాతిరేకాలు
- పేద, మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు వరం 200 యూనిట్ల విద్యుత్ సరఫరా
- కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరుతో నిరుపేదల కళ్ళలో వెలుగులు
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి





**సూర్యాపేట/తిరుమలగిరి/నేరేడుచర్ల/హుజుర్నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** రాష్ట్ర జనాభాలో 85% మందికి ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం దేశ చరిత్రలోనే చరిత్రాత్మక ఘట్టంగా నిలిచి పోతుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ విప్లవాత్మక నిర్ణయం తో తెలంగాణ రాష్ట్రంలో 3.17 కోట్ల మంది లబ్దిదారులకు ఉచితంగా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 13,600 కోట్లతో చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంతో తెలంగాణలో గేమ్ చెంజర్ మొదలైందన్నారు. ఆ గేమ్ చెంజర్ తోటే బుధవారం జరగనున్న పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేయనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

3 వ పేజీ లో...



## ఆర్ఎస్ఎస్ వల్లే బీజేపీకి 'అచ్ఛే దిన్'

- శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భాగవత్ వ్యాఖ్య
- రామాలయం నిర్మాణంపై ఆర్ఎస్ఎస్ పట్టుదలగా ఉందని వెల్లడి
- ఆలయ నిర్మాణానికి సహకరించిన పార్టీలు లాభపడ్డాయని వివరణ

**ముంబై ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు ఆర్ఎస్ఎస్ విధానాలే కారణమని, సంఘ్ వల్లే బీజేపీకి అచ్ఛే దిన్ వచ్చాయని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఆర్ఎస్ఎస్ కు అచ్ఛే దిన్ వచ్చాయన్న వ్యాఖ్యలపై భాగవత్ స్పందించారు. నిజానికి బీజేపీ అధికారం లోకి రావడానికి, ఆ పార్టీకి మంచి రోజులు రావడానికి కారణం ఆర్ఎస్ఎస్ అని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం విషయంలో సంఘ్ పట్టుదలగా వ్యవహరించడం, ఈ ఉద్యమానికి సహకరించిన పార్టీలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వయంసేవకుల కఠోర శ్రమ కూడా ఉందని భాగవత్ స్పష్టం చేశారు.



## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..

### పార్టీ శ్రేణులతో మంత్రి జూపల్లి భారీ ర్యాలీ

**కొల్లాపూర్ ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల ప్రచార ఘట్టం ఈ రోజుతో ముగియనుంది. చివరి రోజు(సోమవారం) ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ పట్టణంలో మున్సిపల్ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపును ఆకాంక్షిస్తూ వేలాది మంది జనంతో అట్టహాసంగా ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించా రు. మున్సిపాలిటీ పరిధిలోని 19 వార్డుల అభ్యర్థులతో కలిసి మంత్రి జూపల్లి ర్యాలీలో అగ్రభాగాన నడువగా వారికి ముందు వరుస ప్రచార రథాలు డీజేలు ఎన్నికల పాటలతో హోరెత్తాయి. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం చౌరస్తా నుంచి ప్రధాన రహదా రిపై కొనసాగిన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ఎన్నికల ప్రచార రథం పై నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ మున్సిపాలిటీ మరింత అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను గూర్చి మంత్రి పేర్కొన్నారు.



## రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి

### ఏప్రిల్‌లో కవిత కొత్త పార్టీ ప్రకటన!

- పార్టీ గుర్తింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు
- ఏప్రిల్‌లో పార్టీని అధికారికంగా ప్రకటించనున్న కవిత
- సామాజిక తెలంగాణే లక్ష్యమంటూ ప్రకటన

**హైదరాబాద్, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త అధ్యాయా నికి తెరలేవనుంది. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ జాగృతి సంస్థ త్వరలోనే రాజకీయ పార్టీగా రూపాంతరం చెందనుంది. కొత్త పార్టీ ఏర్పాటు కోసం గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దరఖాస్తు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అన్ని ప్రక్రియలు సజావుగా పూర్తయితే వచ్చే ఏప్రిల్ చివరి వారంలో లేదా మే మొదటి వారంలో పార్టీని లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన కవిత, సొంత రాజకీయ వేదిక ఏర్పాటుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ‹జాగృతి జనంబాట› పేరుతో ప్రజల్లోకి వెళ్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుంటున్నారు. పార్టీ విధానాల రూపకల్పన కోసం వివిధ వర్గాల అభిప్రాయాలు సేకరించేందుకు 50 కమిటీలను ఏర్పాటు చేశారు. సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా తన పార్టీ పనిచేస్తుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని కవిత ఇప్పటికే స్పష్టం చేశారు. ఈసీఐ నుంచి పార్టీకి సకాలంలో గుర్తింపు లభిస్తే త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికల బరిలోనూ నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది. పార్టీ వ్యూహాల రూపకల్పనలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పాత్ర కూడా ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.



## పదేళ్లలో చేయని అభివృద్ధి ఇప్పుడెలా చేస్తారు

- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా మద్దతు మాకే
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ధీమా

**ఖమ్మం, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేనోళ్లు..ఇప్పుడెట్ల అభివృద్ధి చేస్తారనిమంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు, అధికారంలో ఉన్నప్పుడు దొర పోకడ తప్ప పేదోల కష్టాలు తెలుసుకోలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ప్రజాప్రభు త్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేప ట్టిందని అన్నారు. పంచాయితీల్లో మద్దుత తెలిపనట్లే మున్సిపల్ ఎన్నిక ల్లోనూ ప్రాజమద్దతు తమకు ఉ ందన్నారు. చివరి రోజు ఆయన సుగిగాలి పర్యటనలతో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరేనని చెప్పారని.. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సన్నబియ్యం పండించే రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా చెల్లిస్తున్నామన్నారు. 'ప్రస్తుతంఉన్నది దొరల పాలనకాదు.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమ ప్రభుత్వం' అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం పంపిణీ చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాం లో ఒక్క డబుల్‌బెడ్‌రూంఇల్లు కూడా ఇవ్వకు ండా కమీషన్ల కోసం రూ. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారని విమర్శిం చారు. మొదట విడతగా రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిర మ్మ ఇండ్లునిర్మి స్తున్నామని, ఏప్రిల్‌లో రెండో విడతతో పాటు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

# ఓటుతో భవితకు బాట

ఓటుహక్కు మన
జన్మహక్కు
ఓటు ప్రజాస్వామ్య
సౌధానికి పునాది
ప్రజాస్వామ్యం
ఫరిడవిల్లాలన్న
సాంఘిక ఆర్థిక
సమానత్వం
సాధించాలన్న
మన జీవితాలు

మన తల రాతలు
మారాలన్న
పారదర్శనిక ఎన్నికల్లో
నిజాయితీ పరులైన
నాయకులకు ఓటెయి
ఓటును అమ్ముకోకు
అభివృధిని అడ్డుకోకు
సారా చీరలతో
ఓటును అలంకరించకు
బతుకును భాదల మయం
చేసుకోకు మాయ మాటలకు

చుక్క' బొక్కకు
మోసపోకు
ప్రగతిని అడ్డుకోకు
ఓటు ప్రగతి కి బాట
మనం వేసే ఓటుతో
నవ సమాజం
అవతరిస్తుంది
మనం వేసే ఓటు
మన భవిష్యత్తు
రాబోయే తరాల
మనుగడను
నిర్ణయిస్తుంది

రాజకీయ నాయకుల
తల రాతను మార్చే
ఆయుధం ఓటు
ఓటంటే వజ్రాయుధం
అధికార మార్పిడికి
బ్రహ్మాస్త్రం
ఓటు మార్పుకు సాధనం

ఓటు చట్ట సభల్లో
నీ గొంతు కావాలి
ఓటు శాసన
నిర్మాతను
సృష్టిస్తుంది

ఓటును అమ్మకు
అభివృద్ధిని మరువకు
ఓటును ఉపెక్షించకు
యువత ఓటు పట్ల
నిర్లక్ష్యం విడనాడి
ఆన్లైన్ సోషల్ మీడియాలో
చూయించే స్ఫూర్తితో
ఓటుహక్కు నమోదుపై
శ్రద్ధ పెట్టి
ఎలక్షన్ రోజు పోలింగ్
బూతు బాట పట్టి ఓటరు చైతన్యం
ప్రదర్శించాలి
యువత ఓటుతో
భవితకు బాట
ప్రజోద్దరణకు ఓటు
మదుపు అని తెలుసుకో
భవితను నిర్ణయించుకో

నోటుకు ఓటు ప్రగతికి చేటు
ఓటు తూటా కంటే గొప్పది
ఓటు రాజ్యాంగమిచ్చిన వరం
కారాధు మనీ మధ్యం పరం
ఓటుతో నేరచరితులను
అడ్డుకో
ఓటు అరాచకం పై వేటు
ఓటు సమర్థులకు చోటు
నీతి నిజాయితీ గల
ప్రజా ప్రతినిదిని ఎన్నుకో
అక్రమార్కులను అడ్డుకో

అభివృద్ధి ప్రగతి
శీలురను ఎన్నుకో
ఉచితాలు వద్దు
ఉద్దరనే ముద్దు
సచ్ఛీలురను ఎన్నుకో
సత్వరాభివృదికి
సారథిగా నిలువు





అక్రమాలను అరికట్టి
సామాజిక న్యాయం
కోసం ఓటేయ్యి
అవినీతి అంతానికి
ఓటే వజ్రాయుధం
ఓటును అంగట్లో
అమ్ముకోకు

దేశం కోసం ఐదు
నిమిషాలు ఇవ్వండి
(కెటాయించండి)
ఐదేళ్ల పాటు మన
భవిష్యత్తును
నిర్ణయించే పోలింగ్లో
అందరూ పాల్గొనండి
అన్నసుప్రీమ్ కోర్టు చీఫ్
జస్టిస్డి 'వై చంద్రచూడ్
వాక్య మనకు
శిరోధార్యం కావాలి
ఓటుతో మెరుగైన
పాలనకు బాటేయి
పౌరులబంగారు
భవితను
ఓటే నిర్దేశిస్తుంది

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**9440245771**
**కరీంనగర్**

# నన్ను ఆశీర్వదించండి... 42వ వార్డు అభివృద్ధి చేస్తా





**– కాంగ్రెస్ అభ్యర్థి రుద్రంగి రవికుమార్ గుప్తా.**

**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 09 ( సూర్య సేన) :** సూర్యాపేట పట్టణ కేంద్రంలోని 42వ వార్డు అభ్యర్థిగా రుద్రంగి రవికుమార్ గుప్త ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ, కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ఎన్నికల్లో 3 వరుసలో చెయ్యి గుర్తుకు అమూల్యమైన మీ ఓటును వేసి, గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా చూస్తానని, గెలిచిన వెంటనే నూతనంగా సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణ పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, రుద్రంగి సరిత, రుద్రంగి. దేవిక, మండల సుధాకర్, గుండారపు శ్రీను లక్ష్మి, ఒరిగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ నోటిఫికేషన్ సాధ్యమా?

**– జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రజా పాలన లో ఎందుకు ఈ చిన్నచూపు.?**
**– అర్హత ఉన్న అన్ని పత్రికలను వెంటనే ఎం--పానల్ చేయాలి**
**– పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్లతో వందల్లో చిన్న పత్రికలు బాగుపడతాయి**
**– రిపోర్టర్ల పై సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కక్ష కట్టారా.?**
**– నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం:**
**– జీడిమెట్ల రవీందర్, ఎం ప్యానెల్మెంట్ సాధన సమితి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్రంలో అర్హత ఉన్న పత్రికలను ఎం-ప్యానల్ చేయకుండానే అక్రిడేషన్‌కు అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది కేవలం పరిపాలనా నిర్ణయమా.?లేదా చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లను పక్కన పెట్టే కుట్రానా.? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు, ఏం-ప్యానెల్మెంట్ సాధన సమితి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికల ముందు మీడియా, ముఖ్యంగా చిన్న పత్రికలు, ఫీల్డ్ రిపోర్టర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అలాంటి జర్నలిస్టులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కబడుతున్నారా.? అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం జరుగుతుందన్నారు.

ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ అంటే ఎవరికీ లాభం.?

ఎం-ప్యానల్ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు. పత్రిక నిజమైనదా.? క్రమం తప్పకుండా ప్రచురణ జరుగుతుందా.?

ఫీల్డ్‌లో పని చేసే రిపోర్టర్లు ఉన్నారా.? ప్రజా సమస్యలపై కథనాలు వస్తున్నాయా.? ఈ విషయాలన్నిటిని డిపిఆర్వోలు ఐ అండ్ పి ఆర్ పర్యవేక్షించాలి. కానీ వాళ్ళ పర్యవేక్షణ ఎక్కడ.?

జిల్లా డిపిఆర్ఓ ల వద్ద జిల్లాలో పనిచేసే రిపోర్టర్ల సమాచారం ఉందా.? ఎం పానెల్ చేయకుండా అక్రిడేషన్ ఇస్తే పేపర్ మీద మాత్రమే ఉన్న పత్రికలు, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే బినామీ మీడియా సంస్థలకే దారితీయదా.?

దీని వల్ల నిజంగా రోడ్డెక్కి వార్తలు తెచ్చే గ్రౌండ్ రిపోర్టర్లు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయం సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు గుర్తించడం లేదు.

చిన్న పత్రికలు అంటే సీఎం రేవంత్ రెడ్డికి గిట్టదా.?

గత కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ అధికారంలో ఉంది మరి చిన్న పత్రికలకు మీడియాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు.



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారా.? పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్ ఖర్చులలో దాదాపు చిన్న పత్రికలు అన్ని బతికి బట్ట కడతాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎందుకు అర్థం చేసుకోవడం లేదు అధికారంలోనికి రావడానికి చిన్న పత్రికల సహాయం కావాలి వచ్చిన తర్వాత తొక్కి వేయాలి ఇదేనా.?

ఈ నిర్ణయంతో ఒక ప్రశ్న స్పష్టంగా వినిపిస్తోంది,

"చిన్న పత్రికలు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిట్టదు అని"

పెద్ద పత్రికలకు కోట్ల రూపాయల ప్రకటనలు,

చిన్న పత్రికలకు మాత్రం ఎంపానెల్ లేదు. భరోసా లేదు. గుర్తింపు లేదు,

ఇదేనా ప్రజా పాలన.?

ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన గౌరవం.?

జర్నలిస్టులతోనే అధికారంలోకి వచ్చి,

మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం,

ఈరోజు అదే మీడియాను నియంత్రించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నచ్చినవారికి అక్రిడేషన్, ప్రశ్నించేవారికి నిరాకరణ..

జర్నలిస్టుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం కాదా.? మొదటగా అర్హత ఉన్న చిన్న పత్రికలకు ఏం ప్యానల్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరంగా మారింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముందుగా అర్హత ఉన్న పత్రికలను వెంటనే ఎం-ప్యానల్ చేయాలి.

ఆ తర్వాతే అక్రిడేషన్ ప్రక్రియ చేపట్టాలి.చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లకు న్యాయం చేయాలి. లేకపోతే ఇది మీడియాపై దాడిగా, స్వేచ్ఛను హరించే చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని ఎం - ప్యానల్మేంట్ సాధన సమితి పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులను చిన్నచూపు చూడడం ద్వారా కాదు వారికి గౌరవం ఇవ్వడం ద్వారా మాత్రమే ప్రభుత్వం బలపడుతుందని ఎం- ప్యానల్ మెంట్ సాధన సమితి సూచించింది.

# సూర్యాపేట మున్సిపాలిటీ ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలి



**– 46 వ వార్డు కౌన్సిలర్ గా మొరిశెట్టి నివేదిత లక్షాది ని గెలిపించాలి**
**– ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి**

**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** సూర్యాపేట మున్సిపాలిటీ ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి మొరిశెట్టి నివేదిత లక్షాధిని 46 వార్డులో భారీ మెజారిటితో గెలిపించాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణరెడ్డి అన్నారు.

సోమవారం సూర్యాపేట పట్టణంలోని 46వ వార్డు గడపగడపకు ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ కాబట్టి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో నిధులు ఎక్కువగా తెస్తామని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ లు అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ని గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని సూర్యాపేట కు నిధులు ఇచ్చే భాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీసుకోవాలని అన్నారు.

సూర్యాపేట మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ 46 వార్డు ప్రజలు తనకు మద్దతు ఇచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. మనందరం ఐకమత్యంగా అన్ని వార్డుల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి పనిచేయాలని అన్నారు. 46 వ వార్డు ను ఆదర్శ వార్డు గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఆదర్శ సుందరీకరమైన సూర్యాపేట గా మార్చుకోవడానికి అందరం కలిసి మొరిశెట్టి నివేదిత లక్షాది ని గెలిపిద్దామని పలువురు ప్రముఖులు తెలిపారు. 46 వార్డులో మొరిశెట్టి నివేదిత లక్షాది ని భారీ మెజారిటీగా గెలిపిద్దాం అని విద్యానగర్ 46 వ వార్డు లో జరిగిన ర్యాలి లో వార్డు ప్రజలు కాంగ్రెస్ నాయకులు మహిళలు యువత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు ఓటేస్తే... మరింత గోసపడతం...



మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నట్టుగానే మళ్లీ 2014 కు ముందు రోజులు వచ్చినయని, సీఎం ఆయన మంత్రి వర్గమంతా దోచుకునే పనిలో పడ్డారని ఆయన పేర్కొన్నారు. మంత్రుల మధ్య సఖ్యత లేక ఒకరి బండారం ఒకరు బయటపెట్టుకుంటున్నారని, వాళ్ళల్లో పంపకాల పంచాయితే కాదు, రాసలీలల పంచాయితీలు పెట్టుకోవడం మరీ నీచం, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల పై కూడా అబండాలు వేస్తున్నారు. వారికి అడ్డు ఆదుపూ లేని అరాచకాలతో రాక్షసానందం పొందుతున్నారని తెలిపారు. సూర్యాపేటకు మంజూరైనా నిధులు వెనక్కి పంపిన దుర్మారం కాంగ్రెస్ ది అని, స్పోట్స్ స్కూల్, స్టేడియం ఆధునీకరణకు 25 కోట్లు, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాలకు 25 కోట్లు, భానుపురి కళా భారతి ఏర్పాటుకు 50 కోట్లు, సీఎం స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ 50 కోట్లు, స్కిల్ డెవలప్మెంట్ కు 25 కోట్లు ఇలా కోట్లాది రూపాయలను వెనక్కి పంపిన పాపం కాంగ్రెస్ పార్టీదన్నారు. ప్రజల పట్ల అభివృద్ధి పట్ల కాంగ్రెసోల్లకు ఎంత సోయి ఉందో అర్ధమవుతుందన్నారు. మార్పు తెస్తామన్న కాంగ్రెస్ 2014 కు ముందున్న మూడు మాత్రం తెచ్చిందని, అవి కూడా వాళ్ళ పెంచిపోసించేది దోమలు, పందులు, రౌడీయిజమే అని అన్నారు. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలవుతాయానే నమ్మకం పోయిందన్నారు. అరాచక కాంగ్రెస్ ను నమ్మి అభివృద్ధి చేసే కెసిఆర్ ను వదులుకున్నారన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే ఒరిగిందేమి లేదని తెలుసుకున్నారు. కాంగ్రెస్ అంటే కరువు, కష్టాలే అని ప్రజలకు అర్థమైందన్నారు. అభివృద్ధి కుంటుపడింది.. కనీసం చెట్లకు నీళ్లుపొసే దిక్కులేదని వాపోయారు. అరాచక కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. మరోమారు మోసపోకుండా ఓటు అనే ఆయుధంతో సరైన సమాధానం చెప్పాలి. అన్ని మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుందని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు సరైన బుద్ధి చెప్పింద్రు అని, సూర్యాపేట ప్రజలు చాలా చైతన్యవంతులు, అన్ని వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్ధులను గెలిపించి మరొమారు చైతన్యాన్ని చాటాలన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు. అందుకు మీ చేతిలో ఉన్న ఓటే సరైన ఆయుధం అని, కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని పేర్కొన్నారు.

# పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య చాలా కీలకం



**– జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**


**నల్గొండ / మర్రిగూడ, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య చాలా కీలకమని జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మర్రిగూడ మండలం, సరంపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడి స్కూలును సందర్శించి పిల్లలతో మాట్లాడి చదువు పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకొని, అక్షరాలు--సంఖ్యలు చెప్పిస్తూ ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, పోషణాహార వివరాలు, హాజరు పరిస్థితి తదితర అంశాలపై అక్కడ ఉన్న అంగన్వాడి ఆయాలతో వివరాలు తెలుసుకున్నారు. పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని , వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలతో ఆప్యాయంగా మాట్లాడుతూ ఏం తిన్నారు? ఏం పెట్టారు? అని అడిగారు. దానికి పిల్లలు సమాధానం చెప్తూ పప్పు పెట్టారు అని చెప్పారు. ఏ ఫర్ ఆపిల్, బి ఫర్ బాల్, సి ఫర్ క్యాట్ ,డి ఫర్ డాగ్అని . 1 నుండి 20 వరకు అంకెలు అడిగారు. తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య , సిపిడిఓ సక్కుబాయి, మునుగోడు సిడిపీవో కలెక్టర్ వెంట ఉన్నారు.



# మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బందితో, చివరి ర్యాండమైజేషన్



**నల్గొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సిబ్బంది చివరి ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర ఎస్ సి ఈ ఆర్టీ సంచాలకులు జి .రమేష్ సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ నెల 11న ఎన్నికలు జరగనున్న నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, మిర్యాలగూడ, నందికొండ, హాలియా, దేవరకొండ, చండూరు, చిట్యాల, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు గాను మొత్తం 475 పోలింగ్ కేంద్రాలలో 20% రిజర్వ్ కలుపుకొని పోలింగ్ సిబ్బందిని కేటాయిస్తూ ర్యాండమైజేషన్ చేయడం జరిగింది. 571 మంది పీవోలు, 571 మంది ఏపీవోలు, 1713 మంది ఓపిఓలు మొత్తం 2855 మంది సిబ్బందికి ఈ ర్యాండమైజేషన్ లో పోలింగ్ విధులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి ఆడాన్సపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



సూర్యసేన
మంగళవారం, ఫిబ్రవరి 10, 2026

# సన్నబియ్యం పంపిణీ దేశ చరిత్రలోనే చరిత్రాత్మకం



పురపాలక సంఘం ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరిన నేపధ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లాలోని తిరుమలగిరి,సూర్యాపేట,నేరేడుచర్ల, హుజుర్నగర్ పురపాలక సంఘాల పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. కోదాడలో జరిగిన ప్రచార సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంట స్థానిక శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ, తిరుమలగిరి పురపాలక సంఘం పరిధిలో జరిగిన కార్యక్రమంలో భోనగిరి లోకసభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి,స్థానిక శాసనసభ్యులు మందుల శ్యామ్యేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పురపాలక సంఘాల పరిధిలో జరిగిన ఎన్నికల సభలలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్ల బి.ఆర్.ఎస్ పాలనలో అర్హులైన నిరుపేదలకు ఒక్కటి అంటే ఒక్కటి కుడా తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయలేక పోయారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేసి పేదల కళ్ళల్లో వెలుగులు నింపామన్నారు. అంతే గాకుండా

పట్టణాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణాలలో పెరుగుతున్న జనభాకనుగుణంగా పెరుగుతున్న విస్తీర్ణం దృష్టిలో పెట్టుకుని మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించు కుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా జరుగుతున్న అభివృద్ధి అమలవుతున్న సంక్షేమ పథకాలే రేపటి మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేయనుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం



**– బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్**

**రంగారెడ్డి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** ఎన్నికలు జరిగే మున్సిపల్ కార్పొరేషన్లలో అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని, ఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగరాలని అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నాడు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ. రెండున్నర సంవత్సరాల నుండి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కొంతమంది కళ్ళు ఉండి చూడలేని కబోదులకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హయాంలో చేసిన అభివృద్ధి లిస్టు చేంతాడంత ఉందని అన్నారు. రెండు సంవత్సరాలలో 70 వేల ఉద్యోగాలు కల్పించడం, హాస్టల్ గురుకుల విద్యార్థుల మెస్ చార్జీలు 40% పెంచడం కాస్మోటిక్ చార్జీలలో 200% పెంచడం లాంటివి కాకుండా 25వేల కోట్లతో 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మాణం కొనసాగుతుందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు అల్పాహారం అందించాలని ముఖ్యమంత్రి సంకల్పంగా తీసుకున్నారని 25.3 లక్షలమంది రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తొమ్మిది రోజుల్లో 9000 కోట్లు రైతు భరోసా నిధులు ప్రభుత్వం ఇచ్చిందని, వ్యవసాయ రంగానికి1.15 లక్షల కోట్లు ఖర్చు చేశారని వ్యవసాయాన్ని పండుగ చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తరువాత మహిళల చేతిలో 27 వేల కోట్లు నిధులు పెట్టిన ఘనత కూడా కాంగ్రెస్ దేనని ప్రస్తుతం మహిళలకు పెట్రోల్ బంకులు నిర్వహించుకునే సదవకాశాన్ని కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్ కే దక్కుతుందని నూతి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 17,442 కోట్లు ఖర్చు చేశామని భారత రాష్ట్ర సమితికి, భారతీయ జనతా పార్టీకి ఓట్లు వేస్తే చెత్తబుట్టలో వేసినట్లేనని అభివృద్ధి సంక్షేమం అందిస్తున్న కాంగ్రెస్ కు పట్టం కట్టాలని అభిప్రాయానికి ఓటర్లు వచ్చారని, ఆదిలాబాద్ నుండి గద్వాల, పరిగి నుంచి కోదాడ వరకు కాంగ్రెస్ ను గెలిచి తీరుతుందని స్పష్టత ఓటర్లలో ఉంది అన్నారు. ఒక పది సంవత్సరాలు కుటుంబ పాలనలో నలిగిన ప్రజలు ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజాపాలన నడుస్తుందన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రజలు ఉన్నారని గత ప్రభుత్వ హయాంలో అర్హులకు రేషన్ కార్డులు అందలేదని అర్హులైన కుటుంబ సభ్యులకు రేషన్ కార్డులో నమోదు చేసే అవకాశం కూడా ఉండేది కాదని గత ప్రభుత్వం ఏడాదికి 12,000 కోట్లు ఖర్చు చేసి 2.8 కోట్ల మందికి దొడ్డు బియ్యం ఇచ్చే వారని ఆ దొడ్డు బియ్యం తినలేక 90 శాతం మంది లబ్ధిదారులు కిలో ఐదు రూపాయల చొప్పున విక్రయించే వారని దీనితో దొడ్డు బియ్యం పక్కదోవ పట్టి రైస్ మిల్లులకు, బీర్ల కంపెనీలకు, పౌల్ట్రీ ఫాంలకు వెళ్లిపోయేవని తెలిపారు. గత ప్రభుత్వం ఇలాంటి అక్రమ వ్యాపారాలకు తెగబడిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉచిత బియ్యం పక్కదోవ పట్టవద్దన్న ఉద్దేశంతో సన్నబియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. సన్న బియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని దేశంలో 29 రాష్ట్రాలలో ఎక్కడా సన్న బియ్యం ఇస్తున్న దాఖలాలు లేవని అన్నారు. 13,600 కోట్లతో 3.15 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందించామని పార్టీలతో ప్రమేయం లేకుండా ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందించే బాధ్యత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 100% శాతం తన భుజస్కందాలపై వేసుకుని విజయవంతం చేశారని అన్నారు. అంతేకాకుండా రైతులకు బోనస్ ఇవ్వడం, సన్నధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు ఎక్కడ కష్టం కలగకుండా ప్రజా పాలన సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అన్ని మున్సిపాలిటీలలో, గెలిపించి రాష్ట్ర ముఖ్యమంత్రి కే కానుకగా అందజేయాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు. దేశంలో కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ దేశంలోనే మొట్టమొదటిసారి కులగణన చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కుల గణన చేపట్టబోతుందని, ఎస్సీ బిడ్డల జీవితకాల కోరిక అయినా ఏ.బి.సి.డి ల వర్గీకరణ చేసి చూపించామని 13వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సన్న బియ్యం ఇస్తున్న ప్రభుత్వం ఏకైక తెలంగాణ ప్రభుత్వమేనని రాష్ట్రంలో ప్రజల సంతోషాన్ని ప్రతిపక్ష నాయకులు ఓర్వ లేకపోతున్నారని అక్కసుతో, అసూయతో, అసత్యాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్, ఉప ఎన్నికలలో పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పని అయిపోయింది అని ప్రచారం చేశారని కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా వారు "కారు" కూతలు కూస్తున్నారని మునిసిపల్ ఎన్నికల్లో 100కు 100% కాంగ్రెస్ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను ఇన్చార్జిగా ఉన్న హుజూర్ నగర్ ప్రాంతం మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని దక్కించుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం పని చేసే ప్రభుత్వమని గత ప్రభుత్వం చేసిన నిర్వాకంతోనే 10 ఏళ్ల రాష్ట్రం ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని ప్రజాపాలన ప్రభుత్వంలో రైతాంగం పేద ప్రజలు నిరుద్యోగులు సంతోషంగా ఉంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని ఎవరు ఎన్ని విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ అదరదు, బెదరదు, అన్నారు, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిలో సహకరించక పోయిన తల తాకట్టు పెట్టి అయినా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్న ఘనత మా ముఖ్యమంత్రి కే దక్కుతుందని అందుకే ప్రజలంతా విజ్ఞతతో ఆలోచించి "హస్తాని"కి సమస్త సహకారం అందించాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

# హుజూర్ నగర్ అత్యాద్భుతంగా అభివృద్ధి చేస్తా...

**– కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి**

**– అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు**

**హుజూర్నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11న జరగనున్న మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని, హుజూర్నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డులలోని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవనున్నారని హుజూర్ నగర్ మున్సిపాలిటీని ఆధ్యాద్భుతంగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర నేటిపారుదల పౌరసరఫరాల శాఖ మాత్యులు నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా సోమవారం హుజూర్ నగర్ లోని ఐదవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని యరగాని సుష్మా మురళి ని, 6 వ వార్డ్ లో సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఎం పార్టీ అభ్యర్థిని శీలం నాగమణి శ్రీను, 10,17 వార్డ్ లలో కంకి కొడవలి గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఐ పార్టీ అభ్యర్థులను, హస్తం గుర్తు పై పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నత ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అలాగే హుజూర్ నగర్ మున్సిపాలిటీలో మిత్ర పక్షాలైన సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీల గుర్తులపై పోటీ



చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ వార్డుల అభ్యున్నతకై తోడ్పడాలన్నారు. హుజూర్ నగర్ మున్సిపాలిటీ పరిధిలో మంత్రి ఉత్తమ్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ హుజూర్ నగర్ మున్సిపల్ పరిధిలోగల అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పట్టణ శివారులోని ఫణిగిరి రామస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న ఇందిరా మోడల్ కాలనీ లోని ఇళ్ళను త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. హుజూర్ నగర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. పెన్షన్లు మంజూరు చేస్తామని, డ్రైనేజీ సిసి రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు ఎస్కే మన్సూర్ అలీ కాంగ్రెస్ పార్టీ, సిపిఐ పార్టీ, సిపిఎం పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలి

**– అసెంబ్లీ ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా పింఛన్ డబ్బులు పెంచి ఇవ్వాలి**

**– పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**



**గరిడేపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు వాగ్దానం చేసిన విధంగా వృద్ధులు,వితంతువులకు 4000 రూపాయలు చొప్పున, వికలాంగులకు 6000 రూపాయలు చొప్పున ఇచ్చి తాము ఎలక్షన్ సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం గరిడేపల్లి మండల సిపిఐ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం ఎంపీడీవో కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన చాలామంది ప్రజలు, ప్రభుత్వం సైట్ ఓపెన్ చేయనందున, లక్షలాది మంది దరఖాస్తులు చేసుకొని కూడా పెన్షన్ పొందలేక పోతున్నారని ప్రభుత్వం వెంటనే సైట్ ఓపెన్ చేసి ఇప్పటికే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పెన్షన్లు దరఖాస్తుల ఆమోదిస్తూ,, మరియు పెన్షన్ కు దరఖాస్తు చేసుకునే వారు ఎవరైనా ఉంటే వారి దరఖాస్తులను కూడా స్వీకరించి అర్హులందరికీ పెన్షన్లు ఇచ్చి వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు త్రిపుర సుధాకర్ రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి,రత్నాని సైదులు పోకల ఆంజనేయులు, షేక్ నబి సాయిబు,మెండే లింగయ్య, ఆదినారాయణ, చిల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపాలిటీ ఎన్నికలకు ఐదు అంచల భద్రతా ఏర్పాట్లు





హుజూర్నగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 09 (సూర్య సేన): ఈ నెల 11న జరగనున్న హుజూర్నగర్, నేరేడుచెర్ల మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఐదు అంచల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నట్లు సీఐ చరమంద రాజు తెలిపారు. హుజూర్నగర్, నేరేడుచెర్ల మున్సిపాలిటీల్లో మొత్తం 43 వార్డులు ఉండగా, అందులో హుజూర్నగర్లో 28, నేరేడుచెర్లలో 15 వార్డులు ఉన్నాయి. రెండు మున్సిపాలిటీల్లో కలిపి 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో హుజూర్నగర్లో 56, నేరేడుచెర్లలో 30 కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 31 పోలింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయగా, హుజూర్నగర్లో 18, నేరేడుచెర్లలో 13 ఉన్నాయి. రెండు మున్సిపాలిటీల పరిధిలో 12 మార్గాలు, 12 సంచార బృందాలను నియమించారు. మొత్తం 86 పోలింగ్ కేంద్రాల్లో 10 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ నిఘా చిత్రీకరణ పరికరాలు ఏర్పాటు చేసి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఉంచారు. ఎన్నికల భద్రత కోసం ఒక అదనపు పోలీసు అధికారి, ఒక డి.ఎస్.పి, ఐదుగురు సీఐలు, 14 మంది ఎస్ఐలు, 150 మంది సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. అదనంగా ప్రత్యేక దాడి దళాలు కూడా సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన సామగ్రిని కట్టుదిట్టమైన భద్రత కలిగిన గదుల్లో భద్రపరుస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా గత పది రోజులుగా ప్రణాళికాబద్ధంగా తనిఖీలు, పర్యవేక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు మున్సిపాలిటీల్లో కలిపి సమస్యాత్మక వ్యక్తులు, అనుమానితులు, గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన వారిని మొత్తం 380 మందిగా గుర్తించగా, అందులో 190 మందిని ఐదు లక్షల రూపాయల పూచీకత్తుతో అధికారుల ఎదుట బంధపత్రాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆయుధ అనుమతి కలిగిన వ్యక్తుల వద్ద నుంచి 18 తుపాకులను స్వాధీనం చేసుకొని ప్రధాన కార్యాలయంలో జమ చేశారు. అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై 9 కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి రూ.29 వేల విలువైన 32.8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చరమంద రాజు తెలిపారు.

# రంగారెడ్డి జిల్లా గ్రంధాలయానికి డ్రైనేజీ అవుట్ లేక అవస్థలు

**– బడంగ్ పేట విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి**

**రంగారెడ్డి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** కోట్లాది రూపాయల ప్రజా ప్రభుత్వ నిధులతో విద్యార్థులు యువత భవిష్యత్తు కోసం విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో ముందుచూపుతో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయాన్ని మహేశ్వరం నియోజకవర్గ బడంగ్ పేట సర్కిల్ కార్యాలయం పక్కన నిర్మించారు. ఇప్పటికే ఎంతోమంది యువతీ, యువకులు, అక్కడ చదువుకుని ఉద్యోగం సంపాదించుకున్నారు. అయితే గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు యువతీ యువకులకు డ్రైనేజీ అవుట్ లెట్ సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. గత మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గంలో అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడం వలన డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయలేకపోయారు. ఈ విషయాన్ని గ్రంథాలయ సంస్థ అధికారులు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విద్యార్థులు మా ప్రతినిధికి తెలిపారు. అలాగే ప్రస్తుతం బడంగ్ పేట సర్కిల్ కార్యాలయం అధికారులు పట్టించుకోకపోవడంతో డ్రైనేజీ నుంచి వచ్చే దుర్గండంతో తమకు నరకప్రాయంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వ అధికారులు చెప్పడం తప్ప ఆచరణలో కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. పైన పటారం లోన లొటారం అన్నట్టుగా గ్రంథాలయ పరిస్థితి ఉందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక్కడ చదువుకోడానికి వచ్చేవారికి సరి అయిన కుర్చీలు,ప్యాడ్ వసతులు లేవని తాగునీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ అవుట్ లెట్ లేక సెప్టిక్ ట్యాంకు ప్రతిరోజు పొంగిపొర్లుతూ ఉండడంతో భయంకర దుర్వాసనతో చదవలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని నీటి సంపు పై మూత లేక ప్రమాదం పొంచి ఉందని విద్యార్థులు వెల్లడించారు. గ్రంథాలయం పక్కనే డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఇతర ఉన్నతాధికారులు ఉన్నప్పటికీ ఈ సమస్య కనిపించకపోవడం ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు ఈ దుస్థితికి






అధికారుల వైఫల్యమే కారణమని మండిపడ్డారు.గత కొంతకాలంగా పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ అంటున్న అధికారులకు ఇదేనా మీ స్పెషల్ డ్రైవ్? అని ప్రశ్నిస్తున్నారు ఈ విషయాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోవడం జరిగిందని అన్నారు. ఈ విషయంపై అధికారులు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకొని డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసిఅవుట్లెట్ సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు లేనిపక్షంలో ఆందోళనకు సమాయత్తమవుతామనివారు హెచ్చరించారు.

# పునాది చదువుల్లో నాణ్యత పెంచాలి

**గరిడేపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** మండల పరిధిలోని పాఠశాలల్లో పునాది స్థాయి చదువులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాధికారి పానుగోతు ఛత్రు నాయక్ సూచించారు. సోమవారం పాత అప్పన్నపేట ప్రాథమిక పాఠశాల, అబ్బిరెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల బోధన విధానం, పునాది స్థాయి చదువు స్థితిగతులను పరిశీలించారు. మూడో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు, గణితం బోధనను గమనించి ఉపాధ్యాయుల బోధనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 26న జరగనున్న పునాది చదువు సర్వే పరీక్షకు విద్యార్థులు పూర్తిగా సిద్ధంగా ఉండేలా బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాలల మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు పట్టికలు, బేస్‌లైన్ పరీక్షల వివరాలను పరిశీలించారు. ప్రతిరోజూ శాతం శాతం హాజరు నమోదు చేయాలని, ఉపాధ్యాయులు సెలవులకు ముందస్తు లిఖితపూర్వక అనుమతి తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన ఆయన, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, రవీందర్, వనరుల ఉపాధ్యాయులు రామకృష్ణ, అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

మంగళవారం, ఫిబ్రవరి 10, 2026

# మనువాదం, మగవాదం, మార్కెట్ తత్వం

ఈ మధ్యన ఒక సీనియర్ నటుడు మహిళల వస్త్రాల గురించి, శరీరాల గురించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. తన మాటలపై స్త్రీ స్వాతంత్ర్యవాదులు దాడి చేసినా చేయొచ్చనీ ఆయన ముందే సెటైరు వేశారు. ఆ తర్వాత తను వాడిన రెండు పదాలకు మాత్రం క్షమాపణ చెబుతున్నాననీ, అయితే తన ఉద్దేశం మొత్తం భావం సరైనవేననీ ఇంకా సమర్థించుకున్నారు. అంతేగాక తనపై విమర్శ చేసిన నటీమణి పేరు తీసి మరిన్ని సవాళ్లు విసిరారు. ఆయన ప్రస్తావించిన ఉదాహరణలతో ముడిపడి వున్న మహిళలు ముఖ్యంగా నటీమణులు గట్టిగానే సమాధానమిస్తున్నారు. ఇవన్నీ సంచలనం కోసం కూడా చేస్తుంటారనే వాదనా వుంది. అయితే సరిగ్గా ఈ సమయంలోనే మరికొన్ని పరిణామాలు కూడా దుమారం రేపడం గమనించవచ్చు. ఉత్తర ప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 2017లో 13 ఏళ్ల మైనర్ బాలికపై ఘోర అత్యాచారానికి పాల్పడటమే గాక ప్రశ్నించిన ఆమె కుటుంబంపైనా హత్యాకాండకు దిగిన బిజెపి మాజీ ఎంఎల్ఎ కులదీప్ సెంగార్‌పై శిక్షను నిలిపేసి బెయిల్‌పై విడుదల చేశారు. రాజస్థాన్‌లో జాట్ కులస్తులలో ఒక శాఖకు చెందిన వివాహిత మహిళలు మొబైల్ ఫోన్ వినియోగించరాదనీ, చదువుకునే అమ్మాయిలు కూడా చదువులు, పరీక్షలకు మాత్రమే దాన్ని వాడుకోవాలనీ ఒక కులపంచాయితీ హుకుం జారీ చేసింది. అసభ్యతల పరంపర: ఇవి గత రెండు మూడు రోజుల సంగతులు మాత్రమే. కాస్త వెనక్కు వెళితే కొద్ది రోజుల కిందట బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఉద్యోగ నియామకం కోసం వచ్చిన యువతి బురఖా లాగారు. ఈ వయసులో మీరు ఇలాంటి బట్టలు వేసుకోవడం సరైందా అని నటిని ప్రశ్నించిన మరో సీనియర్ పాత్రికేయుడు తర్వాత క్షమాపణలు చెప్పారు. ఓ ప్రముఖ బహు భాషా నాయికకూ రాజకీయ నేతకూ సంబంధించి అసభ్య ఆరోపణ చేసిన ఒక రాష్ట్ర మంత్రిణి బాగా ఆలస్యంగా క్షమాపణ చెప్పి బయటపడ్డారు. ఇంకా కొంచెం వెనక్కు వెళితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమ్మాయి పుట్టాలని ఎవరూ కోరుకోరని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వాలంటీర్ల కారణంగా కుటుంబాల్లో మహిళలు అదృశ్యం అవుతున్నారని అప్పట్లో ఆరోపించారు. సినిమా హీరోలు, నటులు వేడుకల్లో ఉపయోగించిన అవాకులు చవాకులు సరేసరి. అమరావతి వేశ్యల రాజధానిగా మారిందని అలాంటి లెక్కలనే ఉటంకిస్తూ ఒక పాత్రికేయుడు కల్లోల కారకులయ్యారు. ఒక మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషుడు బికినీలు వేసుకోవద్దని ప్రకటించారు. శాసనసభల్లోనే పెద్ద నేతల భార్యల గురించి వెకిలిగా మాట్లాడిన మంత్రులున్నారు. ఇప్పటికీ భార్యలను, కుటుంబ సభ్యులనూ అనవసరంగా చర్చలోకి తెచ్చే ధోరణులు సాగుతూనే వున్నాయి. కీలక పదవుల్లో వున్న మహిళలనూ అగ్రతారలనూ కూడా అవమానకరంగా మాట్లాడిన ఉదంతాలున్నాయి. ఈ వ్యాఖ్యలు చేసిన వారి నేపథ్యాలూ, ముగింపులూ అన్నీ ఒకే తరహాకు చెందినవి కావనేది నిజమే. ఇలాంటి వివాదాలు జరిగినప్పుడల్లా వ్యక్తులు, సంస్థలు వారివారి రాజకీయాలనూ అభిమాన దురభిమానాలను బట్టి స్పందించడం, వ్యాఖ్యానించడం జరిగిపోతుం టుంది. కానీ వీటి వెనక వున్న ఘోరమైన కుసంస్కారం, మహిళా వివక్ష మరుగు పడిపోతుంటాయి. స్త్రీల శరీరాలతో సహా వారి జీవితాల పైన, నైతికతపైన, అసలు వారి పుట్టుకల పైన వారి పిల్లల పుట్టుకల పైనా ఇష్టానుసారం మాట్లాడ్డం, బాధితులైన వారినే నిందితులుగా కారకులుగా చూపించడం వీటిలో ఉమ్మడి లక్షణం.

ప్రభుత్వాధినేతల మౌనం: తాజాగా ఈ నటుడు కూడా తను మాట్లాడిన దాంట్లో కేవలం రెండు పదాలు మాత్రమే పొరబాటనీ మొత్తం భావం మంచిదేననీ ఆయన ఇంకా వాదిస్తున్నారు. నిధి అగర్వాల్ అనే నటి ఒక సినిమా వేడుకకు వెళ్లిన సమయంలో ఒక మూక ఆమె పట్ల అనుచితంగా వ్యవహరించి ఇబ్బంది పెట్టిన కారణంగానే అలా హితబోధ చేశానంటున్నారు (నిధి అగర్వాల్ ఇటీవలనే పవన్ కల్యాణ్ సినిమా 'హరిహర వీరమల్లు'లో నాయికగా నటించారు. ఆమె సినిమాను బాగా ప్రమోట్ చేశారని, ఆమెను చూసి సిగ్గుపడి తనూ ప్రమోషన్‌కు వచ్చానని ఆయన అప్పట్లో చెప్పుకున్నారు. ఇప్పుడు ఆమె పాల్గొన్న వేడుక కూడా గ్లోబల్ స్థాయి కలెక్షన్లు తెచ్చుకున్న ఒక హీరోకు సంబంధించింది.). అయితే 'బాధితులనే నిందితులను చేయడం' అన్న వాక్యంతో ఆమె ఆయనపై స్పందించారు. వస్త్రాలతో నిమిత్తం లేకుండానే అబ్బాయిలతో సహా చిన్నపిల్లలపై అత్యాచారాలు, జంతువులపై హింస ఎందుకు జరుగుతున్నాయని నిలదీశారు. ఇక సవాళ్లకు గురైన నటి అనసూయా భరద్వాజ్‌తో సహా పరిశ్రమలో క్రియాశీలంగా వున్న అనేకమంది దీటైన సమాధానాలు ఇచ్చారు. పైగా ఆయన అరకొర క్షమాపణను అర్జంటుగా ఆమోదించవలసిన అవసరమేమిటని తెలుగు నటీనటుల సంఘమైన 'మా'ను ప్రశ్నించారు. గతంలో నిధిని మెచ్చుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే ప్రశ్న కూడా వచ్చింది. మహిళా సంఘాలు శివాజీ మాటలను ఖండించడం తప్ప పాలక కూటమి నుంచి ఎవరూ దీనిపై ఎందుకు మాట్లాడటం లేదు? అలాగే ఇప్పుడు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రధాన ప్రతిపక్ష నాయకులు తమవారి అసభ్య వ్యాఖ్యల తరుణంలో ఎందుకు మాట్లాడలేదు? మహిళలపై కరుడుగట్టిన ద్వంద్వనీతి, మగవాదం, మనువాదం తప్ప ఇందుకు మరో కారణం లేదు. ఇలాంటి విషయాలపై చర్చ అనవసరమనే వాదన కూడా చాలా తప్పు, అనేక ఖండనలు, నిరసనల తర్వాతనే పరిస్థితి ఇలా వుంది. ఇవీ లేకపోతే మనువాదులు మరెంత దారుణంగా వ్యవహరించేవారో ఊహించడం అసాధ్యం. దొందూ దొందే: మనువాదం, మార్కెట్ వాదం, మగవాదం మహిళలను ఒకేలా చూస్తాయి.

సూర్యసేన

దినపత్రికలో అన్నిరకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం

సంప్రదించండి: 9951241048



## బీజేపీకి లైఫ్ లైన్ అసదుద్దీన్ ఒవైసీయే..

# ఆయనే వారికి దేవుడు

- మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్న
- తెల్లారితే బీజేపీ అసదుద్దీన్‌ను తలుచుకుంటుందని వ్యాఖ్య
- రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేసిందన్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** బీజేపీకి లైఫ్‌లైన్ అసదుద్దీన్ ఒవైసీయే నని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శిం చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఈరోజు తెరపడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీజేపీ నాయకులు అసదుద్దీన్ ఒవైసీ పేరును ఎన్నిసార్లు తలుచుకుం టారోనని ఎద్దేవా చేశారు. మజ్లిస్ పార్టీని చూపించి ఇంకా ఎంతకాలం ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. బీజేపీ తెల్లారితే అసదుద్దీన్‌నే తలుచుకుంటారని, ఆయనే వారికి దేవుడు అన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్రంగా మండిపడ్డారు. మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నాయకులు చెబుతు న్నారని, గల్లీ ఎన్నికలకు మోదీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు వచ్చాయని ఇప్పుడు బీజేపీ నేతలు వచ్చి కేంద్రం నుంచి నిధులు తీసుకు వస్తామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రా(ష్ట్రాలకు రావాల్సిన నిధులు సహ జంగానే వస్తాయని, వీరు తేవడమేమిటని అన్నారు. ప్రత్యేకంగా వారు ఏమైనా నిధులు తెస్తే చెప్పుకోవా లని అన్నారు. తెలంగాణ కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 42 పైసలు వస్తున్నా యని, అదే బీహార్ రూపాయి చెల్లిస్తే ఆరు రూపా యలు వెళుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు.

# కొలిమి అంటుకుంటున్నది.. మళ్లీ!

తెలంగాణ కొలిమి మళ్లీ అంటుకుంటున్నది. మళ్లీ నీళ్లలోంచే నిప్పు పుడుతున్నది. తమ ఒంటిపై నుంచే నదులు పారుతున్నా నోటికి నీళ్లందని తెలంగాణ భూముల ఎద బొగ్గుల కుంపటి వలె మారగా, దశాబ్దాల పాటు నిప్పులై రగిలిన ఆక్రందనలూ, ఆగ్రహాలూ 21వ శతాబ్దం తిరిగేసరికి పెను కొలిమి వలె అంటుకున్నాయి. యజ్ఞకుండం లో 'సహేంద్ర తక్షకాయ స్వాహా' పలికిన తెలంగాణ 2014 నాటికి స్వరాష్ట్రాన్ని సిద్ధింపజేసుకున్నది. జలరాశులను భూములపైకి మళ్లించుకున్నది. దశాబ్ద కాలం గడిచిన తర్వాత ఇప్పుడు కొత్త తక్షకులు పుట్టుకొస్తున్నారు. యజ్ఞకుండం మరొకమారు మండవలసి ఉన్నది. పుట్టుకొస్తున్న నిప్పు లక్ష్యం ఈసారి నీళ్లు మాత్రమే కాదు. ఈ నేల తనను తాను పదేండ్ల పాటు పాలించుకొని అనేక లక్ష్యాలను సిద్ధింపజేసుకున్న తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వపు దారితెన్నులేని పాలన ఫలితంగా వెనుకటి అజెండాను సవరించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. అందులో తిరిగి మొదటి అంశం నీళ్లే అవుతున్నది. ఇంకా మిగిలిన నీటిని ఇంటి ద్రోహుల సాయంతో పొరుగు దొంగలు తరలించుకుపోవడం. అదే సమయంలో, పదేండ్లలో సిద్ధింపజేసుకున్న లక్ష్యా లు అనేకం కాంగ్రెస్ పాలనలో తిరుగుముఖం పడుతున్నందున, వాటి పరిరక్షణ కూడా 'తిరిగి అంటుకుంటున్న కొలిమి' అజెండాలోకి రావలసి ఉంది. ఇక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు పోగుపడుతున్న ప్రజల నిరసనల రాక్షసి బొగ్గు తక్కువేమీ కాదు. ఆ విధంగా ఈ మూడూ కలియగా ఈ రోజున తెలంగాణ కొలిమి మళ్లీ అంటుకుంటున్నది. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి హనీమూన్ అన్నివిధాలా ముగిసిపోయింది. సంప్రదాయిక అర్థంలో హనీమూన్ కాలం మూడు నెలలు, లేదా వంద రోజులు. కానీ, ప్రజలు కోరకుండానే కాంగ్రెస్ తనకు తాను కొన్ని గడువులు ప్రకటించింది. ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజునే రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీపై సంతకం, 100 రోజులలో ఆరు గ్యారెంటీల అమలు, మొదటి సంవత్సరంలోనే యువతీ యువకులకు రెండు లక్షల ప్రభుత్వోద్యోగాలు, మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17 లోపు నియామకాల పూర్తి, ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోపు కులగణన. ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యాసంస్థల్లో, సంక్షే మ పథకాల్లో మైనారిటీలతో సహా అన్ని వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు. కాంగ్రెస్ పార్టీ 42 పేజీల మ్యానిఫెస్టోలో ఇంకా అనేక హామీలున్నా యి గాని, వారు తమంతట తాముగా గడువులు ప్రకటించినవి మాత్రమే ఇక్కడ పేర్కొంటున్నాం. తాము హామీ ఇచ్చి అమలుచేయని వాటి పట్ల కనిపిస్తున్నది అసంతృప్తి కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుపరచటం, లేదా కుదించటం ప్రజలకు ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. హామీ ఇచ్చి అమలు జరపని వాటి జాబితా తర్వాత చూద్దాము. అది, గడువులు దాటిపోయిన హామీల మాట. వాటిని తర్వాత చెప్పుకుందాం. ఇక్కడ ప్రత్యేకంగా అంటున్నది బీఆర్ఎస్ పథకాల కుదింపు లేదా రద్దుల గురించి.

దళితబంధు. దళితులను తమ కాళ్లపై తాము నిలబడేట్టు చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున గ్రాంట్‌గా ఇవ్వటం మొదలుపెట్టింది కేసీఆర్ ప్రభుత్వం.



## కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా

# వదిలి పెట్టం

- రెండేళ్ల తరవాత మళ్లీ అధికారం మాదే
- పాలన చేతకాక...హామీలను అటకెక్కించారు
- హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటాం
- భూపాలపల్లి ప్రచారంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్

**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండేళ్ల తర్వాత ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను తిట్టినోళ్లు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టమని హెచ్చరించారు. మా కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు భూపాలపల్లిలో కేటీఆర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. హామీలు అమలు చేయాలని బరాబర్ అడుగుతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ వెంటపడుతూనే ఉంటామని తెలిపారు. అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల్లో గెలిస్తే కల్యాణలక్ష్మి డబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని అబద్ధాలు చెప్పిండని అన్నారు. కానీ ఇప్పుడు మొఖం బాగోలేక అద్దం పగులగొట్టినట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఉన్నప్పుడు డిసెంబర్‌లోనే రైతుబంధు పడేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఫిబ్రవరి వచ్చినా రైతుబంధు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ తెలిపారు. నువ్వు పెట్టినవా తీసేయడానికి.. రెండేళ్లలో ఈ పొట్టోడు ఏం పీకిండని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే నీ వీపు చింతపండు చేస్తారని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాను తెచ్చింది అభివృద్ధి చేసింది కేసీఆర్ అని తెలిపారు.

# ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర..ఇక మిగిలింది ప్రజా తీర్పే..!



- కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య ముఖాముఖి పోరు

**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ఉత్కంఠభరితంగా ముగిసింది. వారం రోజుల పాటు సాగిన రాజకీయ రణరంగం సోమవారం సాయంత్రం తో తెరపడింది. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారాలతో సూర్యాపేట జిల్లా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఫిబ్రవరి 11న జరిగే పోలింగ్ కోసం ఇప్పుడు అభ్యర్థులు, పార్టీలు ప్రజా తీర్పు కోసం ఎదురు చూస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ -- బీఆర్ఎస్ మధ్య నేరుగా ముఖాముఖి పోరు కనిపించింది. కొన్ని చోట్ల జనసేన పార్టీ, వామపక్షాలు బరిలో ఉండటంతో త్రిముఖ, చతుర్ముఖ పోటీలు నెలకొన్నాయి. స్థానిక సమస్యలు, అభివృద్ధి హామీలు, ప్రభుత్వ పనితీరు ప్రచారానికి కేంద్రబిందువులుగా మారాయి.

సూర్యాపేట జిల్లాల్లో ఉత్కంఠభరిత పోటీ..

సూర్యాపేట జిల్లా పరిధి లోని మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ బలంతో దూకుడుగా ప్రచారం నిర్వహించింది. మంత్రులు విస్తృతంగా పర్యటిస్తూ, పేదలకు ఇళ్ల పట్టాలు, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి హామీలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అధికార పార్టీకి మద్దతిస్తేనే పట్టణాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రచారం చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రతిపక్ష స్వరాన్ని గట్టిగా వినిపించింది. ధరలు, మౌలిక వసతుల లోపాలు, స్థానిక సమస్యలపై ప్రశ్నలతో ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేసింది. కొన్ని ప్రాంతాల్లో వామపక్షాల ప్రభావం గట్టిగానే ఉండగా, జనసేన కూడా తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసింది.

ప్రలోభాలే చివరి అస్త్రాలా?..


ప్రచార ఘట్టం ముగియగానే రాజకీయాలు రహస్య దశకు చేరాయి. కొన్ని ప్రాంతాల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పంపిణీ జరుగుతోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిఘా బృందాలు రంగంలోకి దిగినా, ప్రలోభాల రాజకీయాలు తెరవెనుక కొనసాగుతున్నాయని సమాచారం.

ఫిబ్రవరి 9 సాయంత్రం నుంచి 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమల్లోకి రావడంతో బహిరంగ ప్రచారానికి తెరపడింది. అయితే రహస్య సమావేశాలు, వ్యక్తిగత సంప్రదింపులు మాత్రం కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే దశ ఫలితాలను ప్రభావితం చేసే కీలక ఘట్టమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఇక ప్రజా తీర్పే నిర్ణయం..

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పోలింగ్ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఎన్నికల్లో ప్రధానంగా స్థానిక అభివృద్ధి, సంక్షేమ హామీలు, ప్రభుత్వ పనితీరు కీలక అంశాలుగా మారాయి. కాంగ్రెస్ అధికార బలంతో ముందుకెళ్తుంటే, బీఆర్ఎస్ ప్రతిపక్ష పాత్రలో గట్టి పోరాటం చేసింది. వామపక్షాలు, జనసేన కొన్ని ప్రాంతాల్లో ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో నిలిచాయి.

ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్ జరగనుండగా --- సూర్యాపేట జిల్లా రాజకీయ భవితవ్యం ఎవరి చేతుల్లోకి వెళ్తుందన్నది ఆసక్తికరంగా మారింది.




# పాపం.. ప్రవీణ్ ప్రకాష్..!

అమరావతి: ఏపీ కేడర్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్న తర్వాత, తిరిగి సర్వీసులోకి రావాలని కోరుకుంటూ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పుడు రాజకీయ, అధికార వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. ఒకప్పుడు చక్రం తిప్పిన ఈ అధికారి, ఇప్పుడు తన నిర్ణయంపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ మీడియా ముందు వాపోవడానికి కారణం పోస్టింగ్ కోసమేనని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అత్యంత శక్తివంతమైన అధికారిగా వెలుగొందిన ప్రవీణ్ ప్రకాష్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నారు. తన లేఖను సచివాలయం పోస్ట్ బాక్స్‌లో వేసి వెళ్ళిపోవడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆరేళ్ల సర్వీసు ఉండగానే తీసుకున్న ఈ నిర్ణయం తప్పని ఆయనకు ఏడాదిన్నర తిరగకముందే అర్థమైనట్లు కనిపిస్తోంది. ఇటీవల ఆయన వివిధ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇస్తూ, తాను చేసిన తప్పులను ఒప్పుకోవడం, క్షమాపణలు కోరడం చూస్తుంటే.. ఆయనకు మళ్లీ ఐఏఎస్ హోదా కావాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. నిబంధనల ప్రకారం, ఒక ఐఏఎస్ అధికారి సమర్పించిన విఆర్ఎస్ దరఖాస్తును ప్రభుత్వం ఆమోదించి, సదరు అధికారి రిలీవ్ అయిన తర్వాత దానిని వెనక్కి తీసుకోవడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. సాధారణంగా విఆర్ఎస్ అమల్లోకి రాకముందే దానిని ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఒకసారి ప్రభుత్వం రాజీనామాను లేదా విఆర్ఎస్‌ను ఆమోదించిన తర్వాత, దానిని రద్దు చేసి తిరిగి సర్వీసులోకి తీసుకోవడం అనేది అరుదుగా, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే జరుగుతుంది. దీనికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ అనుమతితో పాటు రాష్ట్ర ప్రభుత్వ బలమైన సిఫార్సు అవసరం. ప్రవీణ్ ప్రకాష్ సర్వీసులో ఉన్నప్పుడు తన తోటి ఐఏఎస్ అధికారులతో ప్రవర్తించిన తీరు ఇప్పుడు ఆయనకు పెద్ద శాపంగా మారింది. గత ప్రభుత్వంలో ఆయన అతి వల్ల ఇబ్బందులు పడ్డ అధికారులు, అవమానాలకు గురైన వారు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక పోస్టుల్లో ఉన్నారు. ప్రవీణ్ ప్రకాష్ వల్ల ఇబ్బందులకు గురైన సహచర అధికారులు, ఆయనను మళ్లీ వ్యవస్థలోకి రానివ్వడానికి ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. ఒక అధికారిపై ఇతర అధికారులందరిలోనూ ఇంత వ్యతిరేకత ఉండటం ఆయన పునరాగమనానికి ప్రధాన అడ్డంకిముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణంగా అధికారుల పట్ల కక్షసాధింపు ధోరణితో ఉండరు. గతంలో చంద్రబాబుకు ప్రవీణ్ ప్రకాష్ సన్నిహితంగా పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, గత ఐదేళ్లలో ఆయన వ్యవహరించిన తీరు, వ్యవస్థలను ప్రభావితం చేసిన విధానం చంద్రబాబుకు కూడా తెలుసు. ఇప్పుడు ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను మళ్లీ చేరదీస్తే అది ఇతర అధికారులకు తప్పుడు సంకేతాలు పంపుతుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి ప్రవీణ్ ప్రకాష్ చేస్తున్న ప్రయత్నాలు అరణ్య రోదనగానే కనిపిస్తున్నాయి. ఒక అధికారిగా ఆరేళ్ల సర్వీసును వదులుకుని బయటకు వచ్చిన తర్వాత, ఇప్పుడు మీడియా వేదికగా తన బాధను చెప్పుకోవడం వల్ల సానుభూతి కంటే విమర్శలే ఎక్కువగా వస్తున్నాయి. అటు నిబంధనలు సహకరించక పోవడం, ఇటు రాజకీయంగానూ, అధికారికంగానూ మద్దతు లేకపో వడంతో ప్రవీణ్ ప్రకాష్ వీఆర్ఎస్ అధికారి హోదాలోనే మిగిలిపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

# నేను నాయకురాలుని కాదు... సేవకురాలుని

- ఆశీర్వదించండి...అభివృద్ధి చేసి, ఆదర్శ వార్డుగా చూపిస్తాను
- 22వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఎలుగూరి అలివేలు చంటిబాబు







**సూర్యాపేట టౌన్ ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను నన్ను ఆశీర్వదించి కౌన్సిలర్ గా గెలిపిస్తే నేను నాయకురాలు ని కాదు.... సేవకురాలుగా వార్డును అభివృద్ధి చేసి, ఆదర్శవార్డుగా చూపిస్తానని 22వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఎలుగూరి అలివేలు చంటిబాబు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం వార్డులో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నూతనంగా రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులో మంచినీటి సౌకర్యం మెరుగుపడే విధంగా చర్యలు చేపడతానని అన్నారు. 22వ వార్డులో ఉన్న సమస్యలకు శాశ్వతంగా పరిష్కరిస్తాం అన్నారు. వార్డును ఉత్తమ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. 22వ వార్డు ప్రజలారా ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి. గతంలో మేము మా సొంత డబ్బు తోటి 22వ వార్డులో కమ్యూనిటీ కి భూమి ఇప్పించడం జరిగినది. అందులో కమ్యూనిటీ హాల్ కట్టుకున్నాము. ఇప్పుడు వంట సామాన్లు మొత్తం ఇప్పించాం, అలాగే వార్డులో ఒక గుడికి షెడ్డు వేపిస్తున్నాం

గత 25 సంవత్సరాల నుండి వార్డు ప్రజలకు, అందుబాటులో ఉండి మిషిన్లు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. గతంలో ఇప్పుడు వార్డులో ఎవరు ఫంక్షన్ చేసుకున్న వారికి ఫ్రీగా ఫంక్షన్ హాల్ ఇస్తున్నాం, అలాగే పెళ్లిళ్లు, పేరంటాలకు 5000 రూపాయలు మరియు 3 వేల రూపాయలు ఇస్తూ వస్తున్నాము. యెల్గూరి అలివేలు చంటి బాబు చేయి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని వార్డు ప్రజలను అభ్యర్థించారు.






# గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా



- 18వ వార్డు ప్రజలకు ఉచిత వైద్యం... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్

**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** గెలిపించండి.. వార్డును అభివృద్ధి చేసి చూపిస్తా 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా, ప్రచారాన్ని ఉత్సాహంగా చేపట్టారు. ఇంటింటి ప్రచారం, కాలనీల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వార్డు ప్రజలను నేరుగా కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీనియర్ డాక్టర్ గా, నా వార్డు ప్రజలందరికీ ఉచిత వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు తీసుకెళ్తూ, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి, పారిశుధ్యం, విద్యుత్ సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమం వంటి అంశాలపై స్పష్టమైన హామీలు ఇస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతానని ఊర రామ్మూర్తి యాదవ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. యువత, మహిళలు, వృద్ధులు సహా అన్ని వర్గాల నుంచి తనకు విశేషమైన స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.



ప్రచార కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి సంఘీభావం ప్రకటించారు. వార్డు ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించి, 18వ వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని పేర్కొన్నారు.

# ప్రభుత్వ విద్యా సంస్థల సామగ్రిపై రూ.100 కోట్ల స్కామ్!

- 2028 ఎన్నికల్లో బీసీ నేతలే సీఎం...
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట ఎమ్మెల్యే వట్టే జానయ్య యాదవ్ నేలి
- బడుగు,బలహీనులు బువ్వ తింటే - అగ్రకులాల నాయకులు భూములు తింటుండ్రు...
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిండ్రు.....
- మున్సిపల్ చైర్మన్ ని ఎంపిక చేయడానికి వాళ్లేవరు....?
- సూర్యాపేటలో జరిగిన టిఆర్పి సభలో తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు







**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసం కోసం అందించే సామాగ్రిపై రూ.100 కోట్ల స్కామ్ జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సభకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బడుగు,బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఏర్పడ్డ ప్రభుత్వ గురుకుల,అనుబంధ పాఠశాలల్లో విద్యార్థులకు కావలసిన సామాగ్రిపై బిఆర్ఎస్,కాంగ్రెస్ ప్రభుత్వాలు కోట్ల రూపాయల స్కామ్ చేశాయని ఆయన ఆరోపించారు. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వశీలో విడుదలైన రూ. 44 కోట్లలో రూ. 40 కోట్లను మాజీ సీఎం కేసీఆర్,స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిలు కలిసి మాయం చేశారని ఆయన ఆరోపించారు అదే తంతుని కొనసాగిస్తూ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 100 కోట్ల స్కామ్ కి పాల్పడిందని ఆరోపించారు. అగ్రకుల,పెత్తందారి వ్యవస్థ కలిగిన పార్టీల ద్వారా ప్రభుత్వ ఆదాయం అనేక అక్రమాలకు,అవినీతికి దారి తీస్తుందని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు బువ్వ తిని బతికితే అగ్రకుల నాయకులు మాత్రం బలహీనుల భూములు తిని బతుకుతున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే జవాన్ రామస్వామి పేరు మీద ఉన్న భూమిని స్థానిక శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి కబ్జా చేశారని ఆరోపించారు. ఆ అంశాన్ని పక్కదారి పట్టించాలనే ఉద్దేశంతో నేడు ఓ జవాన్ తల్లిని అడ్డం పెట్టుకొని మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ వస్తే బడుగు,బలహీన వర్గాల కుటుంబాలు బాగు పడతాయని ఎంతో ఆశిస్తే నేడు తెలంగాణను అగ్రకుల నాయకత్వం అప్పుల పాలు చేశారని విమర్శలు గుప్పించారు . బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల జాతికి చెందిన వట్ట జానయ్య యాదవ్ ని గత అసెంబ్లీ ఎన్నికల ముందు బిఆర్ఎస్ నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. లేని భూకబ్జాలను ఆయనపై తోసేసి ప్రజల్లో దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేసినప్పటికీ అవి ఫలించలేక పోయాయని తేల్చి చెప్పారు. ఆయనపై వచ్చిన ఆరోపణల్లో కడిగిన ముత్యంలా వట్టే జానయ్య యాదవ్ బయటకు వచ్చారన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో జానయ్య యాదవ్ సూర్యాపేటగా ఎమ్మెల్యేగా కాబోతున్నారని జోష్యం చెప్పారు. తెలశీగాణ బీసీ బిడ్డనే సీఎం గా చూస్తారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో సూర్యాపేట చైర్మన్ అభ్యర్థిగా అగ్రకులానికి చెందిన వ్యక్తిని ప్రకటించే అధికారం కాంగ్రెస్ నాయకులకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అగ్రకుల పార్టీలైన బిఆర్ఎస్,కాంగ్రెస్,బిజెపిలను బీసీలు,ఎస్సీలు,ఎస్టీలు, మైనారిటీలు ఆదరించే వద్దని, బీసీలకు అండగా నిలబడుతున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించి తీరాలని కోరారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సిపిఐ మద్దతు.......

- సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**భానుపురి, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం- 2025, వీబీజి-రామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్బీసీలో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం లాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ధర్మ బిక్షం భవనంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 12న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దత్తును తెలియజేస్తున్నామని అన్నారు. జిల్లాలో కార్మికులు, ప్రజా సంఘాలు ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్లను తెచ్చింది. వీటి వల్ల కార్మికులు ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ మరియు పెన్షన్ వంటి సామాజిక భద్రతకు దూరమవుతారు. ఉద్యోగ భద్రత వుండదు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మికుల పనిగంటలు పెంచుతూ చట్ట సవరణ జరిగింది. వీబీజి-రామ్ జీ చట్టం తెచ్చి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటున్నది. బడ్జెట్లో కేటాయింపులు తగ్గింపు, పని రోజులు తగిస్తోంది. విద్యుత్ సవరణ బిల్లువల్ల సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయి. స్మార్ట్ మీటర్లు, క్రాస్ సబ్సిడీ రద్దుతో రైతులు, పేదలకిచ్చే ఉచిత మరియు సబ్సిడీ విద్యుత్ ప్రమాదంలో పడుతుందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పటానికి దేశవ్యాప్త సమ్మెకు దేశ ప్రజలంతా సంఘీభావం తెలిపి సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు రద్దు చేసే అంతవరకు ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్ కుమార్ మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత



- ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి.
- జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్

**సూర్యాపేట క్రైమ్, ఫిబ్రవరి 09 (సూర్య సేన) :** పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదుదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు బరోసా కల్పించాలి అన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యత అని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదద్రులను విస్మరించునట్లు పిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# మహిళపై కత్తితో దాడి... ఒకరికి తీవ్ర గాయాలు



**గరిడేపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 9 (సూర్య సేన) :** మండలంలోని గుండాలమిట్ట గ్రామంలో మహిళపై మరో మహిళ కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. చలికంటి నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కానుగు బక్కమ్మపై కానుగు మాధవి కత్తితో దాడి చేసింది. గతంలో బక్కమ్మ కుమారుడు రాంబాబు, మాధవి మధ్య అక్రమ సంబంధం ఉన్నట్లు గ్రామంలో వివాదాలు నెలకొన్నాయి. ఈ విషయంపై బక్కమ్మ తన కుమారుడిని మందలించి మాధవి వద్దకు వెళ్లకుండా అడ్డుకుంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో రాంబాబు భార్య ఎల్లమ్మ కూలి డబ్బులు పంచుకుంటుండగా మాధవి ఆమె కళ్లలో కారం పొడి చల్లి గాయపరిచినట్లు తెలిసింది. ఈ ఘటనపై వివరణ కోరేందుకు బక్కమ్మ, ఎల్లమ్మ మాధవి ఇంటికి వెళ్లగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన మాధవి కత్తితో దాడి చేయడంతో బక్కమ్మ ఛాతి భాగంలో తీవ్ర గాయం అయింది. బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చలికంటి నరేశ్ తెలిపారు.

# ఆన్‌లైన్ మోసాల బాధితులకు రూ. 25,000 పరిహారం



**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** ఈసారి ద్రవ్య పరపతి విధాన కమిటీసమావేశంలో ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన చేసింది. చిన్న మొత్తంలో జరిగే మోసపూరిత లావాదేవీలలో నష్టపోయిన వినియోగదారులకు రూ. 25,000 వరకు పరిహారం అందించడానికి భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదిస్తుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం తెలిపారు. వినియోగదారుల రక్షణ, డిజిటల్ చెల్లింపుల భద్రతను పెంచడానికి ఆర్‌బీఐ తీసుకున్న అనేక చర్యల్లో ఇది భాగం. దీనికి సంబంధించి మార్గదర్శకాలను త్వరలో జారీ చేస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. ఈ పరిహార ప్రయోజనం జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వస్తుందని, ప్రతి సంవత్సరం కాదు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండటానికి, పదే పదే తప్పులు చేయకుండా నిలువరించడానికే ఈ పరిమితిని నిర్ణయించారు. చెల్లించాల్సిన మొత్తం నష్టంలో 85 శాతం లేదా రూ. 25,000, ఈ రెండింటిలో ఏది తక్కువ అయితే అదిగా లెక్కిస్తారు. ఉదాహరణకు నష్టం రూ. 50,000 అయితే, 85% అంటే రూ. 42,500 అవుతుంది. కానీ ఆర్‌బీఐ రూ. 25,000 మాత్రమే చెల్లిస్తుంది. అదే, నష్టం రూ. 20,000 అయితే, 85 శాతం అంటే రూ. 17,000, కాబట్టి పరిహారం రూ. 17,000 ఇస్తారు. ఆర్‌బీఐ డేటా ప్రకారం, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 29,080 మోసాలు, రూ. 1,457 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. ఆ తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలో కార్డ్, ఇంటర్నెట్ ఆధారిత లావాదేవీలకు సంబంధించిన 13,469 మోసాల కేసులు నమోదయ్యాయని, వీటి వల్ల రూ. 520 కోట్ల నష్టం వాటిల్లిందని బ్యాంకులు నివేదించాయి. అలాగే, బ్యాంకులు కస్టమర్లకు అవసరంలేని, పూర్తిసమాచారం ఇవ్వకుండా రుణాలివ్వడం, రుణాల రికవరీ, అప్పులను వసూలు చేయడానికి ఏజెంట్ల వినియోగంపై మార్గదర్శకాలను జారీ చేస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.

## భారత ఎగుమతిదారులు, ఎంఎస్ఎంఇ రంగానికి సువర్ణావకాశం




**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** భారత్ అమెరికా దేశాల మధ్య కుదిరిన చారిత్రాత్మక ఒప్పందానికి సంబంధించిన అధికారిక ముసాయిదా విడుదలైంది. దీంతో ఇరు దేశాల నేతలు ఈ చారిత్రక ఒప్పందం పై హర్షం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియా వేదికగా ప్రకటనలు విడుదల చేస్తున్నారు.అయితే ఈ ఒప్పందం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే క్లారిటీ ఇప్పుడిప్పుడే వస్తుంది. భారత్, అమెరికాల ఒప్పందం కారణంగా.. భారతీయ ఎగుమతిదారులకు సుమారు 30 ట్రిలియన్ డాలర్ల అమెరికా మార్కెట్ అందుబాటులోకి రానున్నట్లు మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇందులో ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవస్థాపకులు మరియు స్టార్టప్ ఆవిష్కర్తలు తమ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయడానికి భారీ అవకాశాలు లభిస్తాయి. అమెరికా తన దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం వల్ల టెక్స్‌టైల్స్, లెదర్, ఫుట్‌వేర్, ప్లాస్టిక్, హ్యాండీక్రాఫ్ట్స్ వంటి రంగాలకు చెందిన తయారీదారులు అంతర్జాతీయ విపణిలో గొప్ప లాభాలను పొందే అవకాశం ఉంది.

తాజా పరిణామాలతో ఎవరికి లాభం ఎవరికి నష్టం అనే విషయాలను ఇక్కడ చూద్దాం. అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా, దేశంలో లక్షలాది కొత్త ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమం చేస్తుంది. ఎగుమతులు పెరగడం వల్ల తయారీ, సేవా రంగాల్లో నూతన అవకాశాలు లభిస్తాయి, ఇవి ప్రధానంగా యువత, మహిళా కార్మికులకు ఎంతో మేలు చేస్తాయి. దీనివల్ల దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగి, మధ్యతరగతి, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని అంచనా వేయబడింది. ఈ ఒప్పందం కారణంగా భారత్ రైతులు, వ్యవసాయ రంగానికి నష్టం కలిగే అవకాశం ఉందని మొదట అనే విమర్శలు వచ్చాయి. అయితే దేశీయ వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. భారత్ తన రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సున్నితమైన వ్యవసాయ, పాడి ఉత్పత్తులైన వరి, గోధుమ, మొక్కజొన్న, పాలు, చీజ్, పౌల్ట్రీ వంటి వాటిని ఈ ఒప్పందం పరిధిలోకి రాకుండా పూర్తి రక్షణ కల్పించింది. దీనివల్ల అమెరికా నుంచి వచ్చే చౌకైన అగ్రి-ఉత్పత్తుల వల్ల మన రైతులు నష్టపోయే ప్రమాదం లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. ఈ ఒప్పందం కారణంగా అమెరికా నుంచి అనే వస్తువులు భారత్‌లోకి దిగుమతి అవుతాయి. దీంతో భారతీయ కంపెనీలు అమెరికా నుంచి వచ్చే నాణ్యమైన ఉత్పత్తులతో పోటీ పడాల్సి ఉంటుంది.

అమెరికా కూడా పరస్పర ప్రాతిపదికన కొన్ని రాయితీలను పొందుతుంది కాబట్టి, మన దేశీయ మార్కెట్లోకి వచ్చే అమెరికా వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఇది భారతీయ వినియోగదారులకు లాభం చేకూర్చినప్పటికీ, దేశీయ తయారీదారులు తమ నాణ్యతను పెంచుకుని పోటీని పెట్టుకోవాల్సిన సవాలును ఎదుర్కొంటారు. ముఖ్యంగా విమాన విడిభాగాలు, జెనరిక్ ఫార్మా రంగాలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మెరుగు పడాల్సి ఉంటుంది.

# ఎస్‌బిఐ వినియోగదారులకు ఇక నుంచి ఛార్జీల మోతే!

**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** దేశీయ బ్యాకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ఖాతాదారులకు షాకిచ్చింది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉన్న ఐఎంపీఎస్ (ఎఓఖూ) నగదు బదిలీ సేవలపై సర్వీస్ ఛార్జీలు వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ కొత్త నిబంధనలు 2026, ఫిబ్రవరి 15 నుంచి అమలులోకి రానున్నాయి. అయితే, సాధారణంగా అత్యవసర నగదు బదిలీల కోసం వినియోగించే ఎఓఖూ సేవలపై బ్యాంక్ పరిమితులను విధించింది. దీని ప్రకారం.. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ మరియు యోనో యాప్ ద్వారా చేసే లావాదేవీలకు ఈ ఛార్జీలు వర్తిస్తాయి. బ్యాంక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. రూ. 25,000 వరకు ఎటువంటి ఛార్జీలు ఉండవు. రూ. 25,001 నుంచి రూ. 1,00,000 వరకు రూ. 2 ప్లస్ జీఎస్‌టీ, రూ. 1,00,001 నుంచి రూ. 2,00,000 వరకు రూ. 6 ప్లస్ జీఎస్‌టీ, రూ. 2,00,001 నుంచి రూ. 5,00,000 వరకు రూ. 10 ప్లస్ జీఎస్‌టీ చార్జ చయనున్నారు. కాగా, రూ. 25 వేల లోపు చేసే లావాదేవీలపై ఎటువంటి ఛార్జీలు విధించకపోవడం సామాన్య వినియోగదారులకు కొంత ఉపశమనం కలిగించే అంశం. నేరుగా బ్యాంకు బ్రాంచ్‌కు వెళ్లి చేసే ఎఓఖూ ఛార్జీలలో ఎటువంటి మార్పు లేదు. అవి పాత పద్ధతిలోనే రూ. 2 నుంచి రూ. 20 వరకు కొనసాగుతాయి.





# కిమ్స్ ఆదాయం రూ. 1,003 కోట్లు

KIMS HOSPITALS™

**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో తొలిసారిగా రూ. 1,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించింది. సమీక్షా త్రైమాసిక ఆదాయం రూ. 1,003 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ. 790 కోట్ల కంటే, ఇది 27% అధికం. ఇదే సమయంలో సంస్థ నికర లాభం మాత్రం రూ. 93 కోట్ల నుంచి రూ. 52 కోట్లకు పరిమితమైంది. కొత్తగా ప్రారంభించిన బెంగళూరు, థానే యూనిట్ల నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సంస్థ వివరించింది. చికిత్స కోసం వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని, ఒక్కో పడక ద్వారా వచ్చే సగటు ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.5% వృద్ధితో రూ. 46,341కి చేరుకుందని పేర్కొంది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల్లోని 25 ఆసుపత్రుల్లో సంస్థకు 7,100 పడకల సామర్థ్యం ఉంది. వివిధ దశల్లో ఉన్న కొత్త ఆసుపత్రుల ద్వారా, పడకల సామర్థ్యం 9,100కు చేరుతుందని కిమ్స్ సీఎండీ బి.భాస్కర రావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరాన్ని మరింత వృద్ధితో ముగిస్తామన్న విశ్వాసం ఉందన్నారు.

# ఏఐ వెల్‌నెస్ కోచ్‌లతో మారనున్న మీ లైఫ్ స్టైల్!



**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** నేటి సమాజం పెరుగుతున్న టెక్నాలజీతో ఎంత వేగంగా మారుతుందో చెప్పడానికి మన చేతుల్లో ఉండే స్మార్ట్ పరికరాలో ప్రధాన ఉదాహరణ. ఒకప్పుడు కేవలం ఫోన్ కాల్స్, మెసేజ్‌లకే పరిమితమైన స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇప్పుడు మన ప్రాణాలను కాపాడే 'లైఫ్ గార్డ్స్'గా మారుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఆరోగ్యంగా ఉండటానికి.. మనం ఏం తినాలి? ఎంతసేపు పడుకోవాలి? చివరికి మనం ఎప్పుడు నీళ్లు తాగాలో కూడా ఇప్పుడు ఒక 'చిప్', 'ఏఐ అల్గారిథం' నిర్ణయిస్తుంది. 2026లో లైఫ్ స్టైల్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్న "ఏఐ వెల్‌నెస్ కోచింగ్" గురించి ఇక్కడ తెలుసుకుందాం. పాత కాలంలో మనకు ఆరోగ్యం బాలేకపోతే డాక్టరు దగ్గరికో, ఫిట్‌నెస్ కోసం యోగా గురువు, జిమ్ ట్రైనర్ దగ్గరికో వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ అవసరం లేకుండానే మన చేతికి ఉన్న స్మార్ట్ రింగ్, స్మార్ట్ వాచ్ మన శరీరంలోని ప్రతి కదలికలను గమనిస్తోంది. ఇవి కేవలం అడుగులను లెక్కించడమే కాకుండా, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను, గుండె వేగంలోని హెచ్చుతగ్గులను, నిద్ర నాణ్యతను సెకన్ల వ్యవధిలో విశ్లేషిస్తున్నాయి. ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, మన శరీర తత్వానికి తగ్గట్టుగా పర్సనలైజ్డ్ సూచనలను అందిస్తున్నాయి. అభివృద్ధి తో పోటీ పడుతున్న ఈ సమయంలో మనం తీసుకునే ఆహారం, మనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి శరీర మెటబాలిజం ఒకేలా ఉండదు. అందుకే అందరికీ ఒకే రకమైన డైట్ ప్లాన్ పని చేయదు. ఏఐ కోచ్‌లు మీ శరీరంలోని షుగర్ లెవల్స్, క్యాలరీ బర్నింగ్ రేటును బట్టి, మీకు ఆ రోజు ఏ ఆహారం అవసరమో సూచిస్తాయి. ఉదాహరణకు, మీరు వ్యాయామం చేసిన తర్వాత ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోమని, రక్తంలో షుగర్ పెరిగితే కార్బోహైడ్రేట్లు తగ్గించమని ఇవి మనకు సలహాలు అందిస్తాయి. పోటీ ప్రపంచంలో పని ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ కారణాల వల్ల ఎంతో మంది మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య గా మిగిలిపోయింది.

ఈ డేటాను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి, మన శరీర తత్వానికి తగ్గట్టుగా పర్సనలైజ్డ్ సూచనలను అందిస్తున్నాయి. అభివృద్ధి తో పోటీ పడుతున్న ఈ సమయంలో మనం తీసుకునే ఆహారం, మనపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరి శరీర మెటబాలిజం ఒకేలా ఉండదు. మీరు ఎప్పుడు ఆందోళనకు గురవుతున్నారో మీ నాడి వేగాన్ని బట్టి ఏఐ గుర్తిస్తుంది. వెంటనే మీ ఫోన్‌లో ఒక చిన్న మెడిటేషన్ సెషన్, ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే ఎక్సర్‌సైజ్ చేయమని రిమైండర్లు పంపుతుంది. తద్వారా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి కాకముందే మిమ్మల్ని అలర్ట్ ఇది చేస్తుంది.

# భారత్‌లో డ్రీమ్‌లైనర్‌లకు మంచి భవిష్యత్తు!



**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** ఒకేసారి 200-300 మంది ప్రయాణికులను, నాన్‌స్టాప్‌గా 15,000 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు చేరవేయగలిగే పెద్ద విమానం డ్రీమ్‌లైనర్ (బోయింగ్ 787) లకు భారత్‌లో మంచి భవిష్యత్ ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. సమీప భవిష్యత్తులో కంపెనీ మంచి వృద్ధి సాధించనుందని బోయింగ్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే తెలిపారు. భారత్- అమెరికా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. భారత ఏరోస్పేస్ రంగ పారిశ్రామికీకరణ లక్ష్యంగా ఇరు దేశాలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. స్వల్పకాలిక సవాళ్లలో కొన్నింటిని అధిగమిస్తామనే ధీమాను సలీల్ వ్యక్తం చేశారు. గత ఏడాది జూన్‌లో అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్న ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదానికి గురై, వందల మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు జరుపుతోందని, త్వరలోనే నివేదిక వెలువడచ్చని పేర్కొన్నారు. బోయింగ్ 787 విమానాలను మనదేశంలో ఎయిరిండియా సొంతంగా నిర్వహిస్తోంది. ఎయిరిండియా చేతిలో మొత్తం 33 డ్రీమ్‌లైనర్‌లు ఉన్నాయి. ఇందులో 26 సంస్థకు చెందిన బీ787-8 మోడళ్లు కాగా, విస్తారా నుంచి ఆరు బీ787-9 విమానాలు, ఒక కొత్త విమానం ఉన్నాయి. 2022 జనవరిలో ఎయిరిండియా ప్రైవేటీకరణ జరిగిన తర్వాత, వచ్చేనెల 1న సరికొత్త డ్రీమ్‌లైనర్ వాణిజ్య కార్యకలాపాలను ఎయిరిండియా ప్రారంభించనుంది. నార్స్ అట్లాంటిక్ ఎయిర్‌వేస్ నుంచి లీజుకు తీసుకున్న కొన్ని డ్రీమ్‌లైనర్‌లను ఇండిగో నిర్వహిస్తోంది.

# పిఎఫ్‌సి చేతికి ఆర్‌ఇసి..

पी एफ सी PFC

आर ई सी REC असीमित ऊर्जा, अनन्त संभावनाएं Endless energy. Infinite possibilities.

**ముంబై, ఫిబ్రవరి, 9 (సూర్యసేన ప్రతినిధి):** దేశీయ విద్యుత్ రంగ ఫైనాన్సింగ్ రంగంలో భారీ విలీనం చోటు చేసుకుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఇసి)లో ప్రభుత్వానికి ఉన్న 52.63 శాతం వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్ఎఫ్‌సి) కొనుగోలు చేసింది. దీనితో ఆర్ఇసి ఇప్పుడు పిఎఫ్‌సికి అనుబంధ సంస్థగా మారింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ కొనుగోలుకు ఆమోదం తెలపడమే కాకుండా, భవిష్యత్తులో ఈ రెండు సంస్థల పూర్తిస్థాయి విలీనానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రెండు సంస్థల విలీనం ద్వారా రుణ పంపిణీ సామర్థ్యం పెరిగి, గ్రీన్ హైడ్రోజన్, ఇవి బ్యాటరీ స్టోరేజ్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం మరింత సులభతరం కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో కేంద్రానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఇది ఒక రకంగా పెట్టుబడుల ఉపసంహరణే కావడం గమనార్హం. మరోవైపు దీనిపై ఇరు సంస్థల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విలీనం ద్వారా విద్యుత్ ఫైనాన్స్ రంగంలో పోటీతత్వం లోపించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఉద్యోగాలు తగ్గుతాయని హెచ్చరిస్తున్నారు.

## మా సినిమాను ఆదరిస్తోన్న ప్రేక్షకులకు ధన్యవాదాలు




భూమిక ప్రధాన పాత్రలో నటించిన 'యుఫోరియా' చిత్రం తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంటుంది. దీంతో ప్రస్తుతం సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు మూవీ టీమ్. ఈ సందర్భంగా 'యుఫోరియా' మూవీ డైరెక్టర్ గుణ శేఖర్ మాట్లాడుతూ.. 'యుఫోరియా' సినిమాకు మార్నింగ్ షో నుంచే మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ టైటిల్ చూసి యూత్ వస్తారని అనుకున్నాను. అయితే ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా వస్తున్నారు. భూమిక, సారా అర్జున్ అందుకు కారణం కావచ్చు. చాలా మంచి రెస్పాన్స్ వస్తుంది. సినిమా నుంచి ఏదైతే ఆశించామో అది వస్తుంది. రెగ్యులర్ కమర్షియల్ పంథాలో కాకుండా, ఎలాంటి ఫార్ములా ఫాలో కాకుండా హార్డ్ హిట్టింగ్ చెప్పాలని అనుకునే ప్రయత్నించాం. దానికి మంచి స్పందన వస్తుంది.

మిత్రులందరు అభినందిస్తున్నారు. రెగ్యులర్ ఫార్మేట్‌ను వదిలేసి కొత్త నటీనటులతో ఇంత పెద్ద స్కేల్‌లో సినిమా చేయటం సాహసమని అందరూ భావిస్తున్నారు. మా సినిమాను ప్రేక్షకులతో పాటు రివ్యూవర్స్ కూడా చక్కగా అర్థం చేసుకుని విశ్లేషించారు. ఈ సినిమాను థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాల్సింది. మౌత్ టాక్‌ను మేం నమ్ముతాం. దాన్ని మరింత పాజిటివ్‌గా అందరికీ స్ప్రెడ్ చేయాలి. ఇంటిల్లిపాది అందరూ చూడటం కోసం మేం అందం చేసిన సినిమా.. ఇంతటి సక్సెస్ ఇస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు' అన్నారు.


## 'టాక్సిక్' తెలుగు రాష్ట్రాల డీల్ క్లోజ్..



రాకింగ్ స్టార్ యశ్ ప్రెస్టీజియస్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'. హై ఎక్స్‌పెక్టేషన్స్‌తో తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఇదిలా ఉంటే.. రిలీజ్‌కు ముందే 'టాక్సిక్' సరికొత్త రికార్డ్స్‌ను క్రియేట్ చేస్తోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఈ సినిమా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన హక్కులను రూ.120 కోట్లకు సొంతం చేసుకున్నారు. దీంతో ఇది నాన్ తెలుగు సినిమాకు కోసం జరిగిన ఆల్‌టైమ్ బిగ్గెస్ట్ డీల్‌గా మారింది. ఈ ఏడాది విడుదల కానున్న మోస్ట్ అవెయిటెడ్ మూవీగా టాక్సిక్ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో టాక్సిక్ నిర్మాతలకు శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు మధ్య ఈ హిస్టారికల్ డీల్‌తో సినిమాపై బజ్ మరింతగా పెరిగింది. ఏపీ, తెలంగాణ హక్కుల కోసం మూడు అగ్ర సంస్థలు పోటీ పడగా చివరకు దిల్ రాజు నేతృత్వంలోని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్‌కు ఈ డీల్ దక్కింది. ఈ సందర్భంగా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ దిల్ రాజు మాట్లాడుతూ.. "ఇండియన్ సినీ ఇండస్ట్రీలోని పెద్ద స్టార్స్‌లో యశ్ ఒకరు. కెజియఫ్ 2 తర్వాత ఆయన మార్కెట్ మరింతగా పెరిగింది. ఆయన నెక్స్ట్ సినిమా టాక్సిక్ కోసం ఆడియెన్స్ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత వస్తోన్న ఈ సినిమాపై ఉన్న అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి ప్రెస్టీజియస్ మూవీని మా ఎస్‌వీసీ బ్యానర్‌పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు రానుండటం చాలా ఆనందంగా ఉంది. యశ్‌తో ఇలాగే మరిన్ని సినిమాలు చేయాలని ఆశిస్తున్నాం" అన్నారు.

## క్రూరమైన పాత్రలో రిషబ్ సాహ్నీ...

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో రాబోతున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'నాగబంధం'. ఈ వేసవిలో విడుదలకు సిద్ధమవుతోన్న ఈ చిత్రం నుంచి తాజాగా టీజర్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. మహా శివరాత్రి స్పెషల్‌గా ఈ నెల15న టీజర్ విడుదల కానున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈ ఇతిహాస కథనంలోని మరో కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. బాలీవుడ్ 'ఫైటర్'లో తన అద్భుతమైన ప్రజెన్స్‌తో ఆకట్టుకున్న రిషబ్ సాహ్నీ నాగబంధంలో ఆఫ్ఘన్ సుల్తాన్ అబ్దాలి పాత్రను పోషిస్తున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించారు. 1750లో బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో భారత్‌లో అబ్దాలీ చేసిన దండయాత్రలు, దేవాలయాల దోపిడీ, అపార సంపద కోసం అతడు చేసిన క్రూర ప్రయత్నాలను చూపించబోతున్నారు. ఇక రిలీజ్ చేసిన ఈ హై-వోల్టేజ్ పోస్టర్‌లో చుట్టూ మెరుస్తున్న కళ్లతో ఉన్న తోడేళ్ల గుంపు అతని చుట్టూ చేరడం పాత్రలోని



క్రూరత్వాన్ని మరింత పెంచుతుండగా.. సినిమాపై మరింత క్యూరియాసిటీ పెంచుతోంది.


మహా శివరాత్రి స్పెషల్‌గా ఈ నెల15న టీజర్ విడుదల కానున్నట్లు తెలిపారు. దీంతో పాటు ఈ ఇతిహాస కథనంలోని మరో కీలక పాత్ర ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

## అది అనుకోని అదృష్టం




అటు బాలీవుడ్‌కీ, ఇటు టాలీవుడ్‌కి సమ ప్రాధాన్యతనిస్తూ లౌక్యంతో ముందుకెళ్తున్నది కథానాయిక మృణాల్ ఠాకూర్. తెలుగులో 'సీతారామం'లో సీతగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మృణాల్, నాని 'హాయ్ నాన్న'తో తెలుగులో ద్వితీయ విఘ్నాన్ని సైతం అధిగమించింది. మూడో సినిమా 'ఫ్యామిలీ స్టార్' కాస్త డిజప్పాయింట్ చేసినా.. త్వరలో 'డెకాయిట్'తో మరోసారి తెలుగులో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నది మృణాల్ ఠాకూర్. రీసెంట్‌గా సౌత్‌లో తన సినీ ప్రయాణం గురించి మృణాల్ మాట్లాడుతూ 'అసలు దక్షిణాది సినిమాల్లో నటించడం అనేది నా ప్రణాళికలో లేదు. నేను సౌత్ సినిమాలు నటిస్తానని అస్సలు అనుకోలేదు కూడా. ఓ విధంగా అది నాకు అనుకోకుండా దొరికిన అదృష్టం. 'సీతారామం' తర్వాత నా విషయంలో బాలీవుడ్ దర్శక, నిర్మాతల దృక్కోణం కూడా మారింది. అందుకే తెలుగు సినిమాకు ఎప్పుడూ రుణపడి ఉంటా' అని తెలిపింది మృణాల్ ఠాకూర్. ఇంకా చెబుతూ 'వచ్చే ఏడాది 'డెకాయిట్'తో మరోసారి టాలీవుడ్ తెరపై కనిపించబోతున్నా. ఆడియన్స్‌కి స్వీట్ షాక్ ఇచ్చే సినిమా ఇది. ఓ కొత్త కథను తెరపై చూస్తారు. నా క్యారెక్టర్ మీ ఊహలకు మించి ఉంటుంది' అని పేర్కొన్నది మృణాల్ ఠాకూర్.

## ఆ రోజే పెళ్లికి ముహూర్తం?



అగ్ర తారలు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న అక్టోబర్‌లో నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఎంగేజ్‌మెంట్ విషయంలో వారిద్దరూ గోప్యతను పాటిస్తున్నారు. ఎక్కడా దాని గురించి మాట్లాడటానికి ఇష్టపడటం లేదు. సరైన సమయంలో అన్ని వివరాలను వెల్లడిస్తారని వారి సన్నిహితులు అంటున్నారు. గత నెలలో జరిగిన 'ది గర్ల్‌ఫ్రెండ్' సక్సెస్‌మీట్‌లో ఈ జంట తళుక్కున మెరిశారు. అదే వేదికపై విజయ్‌ని పొగడ్తల్లో ముంచెత్తింది రష్మిక. దాంతో ఈ జంట పెళ్లి ఖాయమనే నిర్ణయానికొచ్చారు అభిమానులు. తాజా సమాచారం ప్రకారం ఫిబ్రవరి 26న విజయ్-రష్మిక రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో పెళ్లిపీటలెక్కబోతున్నారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఘనంగా పెళ్లికి ఏర్పాట్లు చేయబోతున్నారని, అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ ఉంటుందని చెబుతున్నారు. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే విజయ్-రష్మికలో ఎవరో ఒకరు స్పందించాల్సిందేనని, అప్పటివరకు వారి పెళ్లి తేదీపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంటుందన్నది అభిమానుల మాట.

## విశ్వక్ సేన్ సంచలన వ్యాఖ్యలు..!



టాలీవుడ్ 'మాస్ కా దాస్' విశ్వక్ సేన్ వైవిధ్యమైన కథలను ఎంచుకోవడంలో ఎప్పుడూ ముందుంటాడు. ప్రయోగాలు చేయడానికి ఏమాత్రం వెనుకాడని ఈ యంగ్ హీరో, గత ఏడాది 'లైలా' చిత్రంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అమ్మాయి పాత్రలో నటించి మెప్పించాడు. అయితే, రామ్ నారాయణ్ దర్శకత్వంలో వచ్చిన ఈ యాక్షన్ కామెడీ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. గతేడాది వాలెంటైన్స్ డే కానుకగా విడుదలైన ఈ మూవీ డిజాస్టర్‌గా మిగిలిపోయింది. తాజాగా తన కొత్త సినిమా 'ఫంకీ' ప్రమోషన్స్‌లో భాగంగా విశ్వక్ సేన్ ఒక షాకింగ్ విషయాన్ని వెల్లడించాడు. 'లైలా' సినిమా చూసిన తర్వాత టాలీవుడ్ అగ్ర హీరోలు ఎన్టీఆర్, బాలకృష్ణగారు తనకు ఫోన్ చేసి గట్టిగా వార్నింగ్ ఇచ్చారని విశ్వక్ తెలిపాడు. "లైలా మూవీ చూశాక ఇద్దరూ నన్ను పిలిచారు. ఎప్పటికీ మళ్ళీ అలాంటి ప్రయోగాలు, అలాంటి చిత్రాలు చేయకు అని గట్టిగా చెప్పారు. ఒక రకంగా అది నాకు హెచ్చరిక లాంటిదే" అని విశ్వక్ చెప్పుకొచ్చాడు. మాస్ ఇమేజ్ ఉన్న హీరో ఇలాంటి పాత్రలు చేయడం వల్ల కెరీర్‌పై ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతోనే వారు అలా చెప్పి ఉంటారని ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com




www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com